JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । మంగళవారం 03-03-2026
Medchal - Malkajgiri । Tuesday 03-03-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 276
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 276 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889 call me
jayabheripaper@gmail.com


# గ్రేటర్ ఎన్నికల్లో గెలవాల్సిందే

- గ్రేటర్ హైదరాబాద్ పై గులాబీ పార్టీ స్పెషల్ ఫోకస్
- మూసీ పరివాహక ప్రాంతంలో నిర్వాసితుల సమస్యలపై ఫైట్ చేయాలని కేటీఆర్ నేతలకు దిశానిర్దేశం
- రాబోయే మూడు కార్పోరేషన్ల ఎన్నికలకు కేటీఆర్ వ్యూహాలు



**జయభేరి, హైదరాబాద్ :**
త్వరలో గ్రేటర్ హైదరాబాద్ నగరంలో మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికలు జరిగే ఛాన్స్ ఉంది. దీంతో ఇప్పటి నుంచే అన్ని పార్టీలు తమ ప్రిపరేషన్స్ స్టార్ట్ చేశాయి. ప్రధాన ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్ సైతం ఎన్నికలకు రెడీ అవుతోంది. ఇక తాజాగా మూడు కార్పోరేషన్లుగా జీహెచ్ఎంసీని ప్రభుత్వం చేసింది. జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ కార్పోరేషన్లుగా విభజన చేశారు. దీంతో ముందుగానే బిఆర్ఎస్ పార్టీ అలెర్ట్ అయింది. మూడు కార్పోరేషన్ల పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆయా నియోజకవర్గ ఇంఛార్జిలు, ముఖ్య నేతలతో కేటీఆర్ తాజాగా సమావేశం అయ్యారు. ఇక గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ఉన్న ముఖ్య నేతల భేటీలో ఎన్నికల పైనే ప్రధానంగా చర్చ జరిగింది. మూసీ పరివాహక ప్రాంతంలో నిర్వాసితుల సమస్యలపై ఫైట్ చేయాలని కేటీఆర్ నేతలకు దిశానిర్దేశం చేశారు. తాజాగా కేటీఆర్ మూసీ నిర్వాసితులతో కలిసి పాదయాత్ర చేశారు. మూడు కార్పోరేషన్లలో ఉన్న పారిశుధ్య సమస్యలు, మౌలిక సమస్యలు హైలెట్ చేయాలని కేటిఆర్ నేతలకు చెప్పారు. గ్రేటర్ మూడు కార్పోరేషన్లకు పార్టీ తరపున ఇంఛార్జిలను నియమించారు. జీహెచ్ఎంసీకి ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మల్కాజిగిరికి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, సైబరాబాద్ కు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి ఎన్నికల ఇంఛార్జ్ భాధ్యతలు అప్పగించారు.

...మిగతాది 2 లో



# సొంతూరుకు విరోషి

- డప్పులు, వాయిద్యాలతో ఊరేగింపుగా కొత్త జంటకు ఆహ్వానం
- పెళ్లి తర్వాత తన భార్య రష్మికతో కలిసి ఫస్ట్ టైం సొంతూరికి రావడంతో గ్రామంలో సందడి వాతావరణం

**జయభేరి, మహబూబ్ నగర్, మార్చి 2 :**
స్టార్ హీరో విజయ్ దేవరకొండ తన భార్య రష్మికతో కలిసి తన సొంతూరు తుమ్మనపేటలో సందడి చేశారు. సోమవారం ఉదయం ఫ్యామిలీతో కలిసి గ్రామానికి చేరుకున్న ఆయనకు ఊరి ప్రజలు ఘన స్వాగతం పలికారు. డప్పులు, వాయిద్యాలతో ఊరేగింపుగా కొత్త జంటకు ఆహ్వానం పలికిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు నిండు మనసుతో ఆశీర్వదించారు.విజయ్ స్వస్థలం తెలంగాణలోని నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం బల్మూర్ మండలంలోని తుమ్మనపేట గ్రామం. ఓ మారుమూల గ్రామం నుంచి వచ్చిన విజయ్ తన టాలెంట్తో ఇండస్ట్రీలో స్టార్ హీరోగా ఎదిగారు. తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. పెళ్లి తర్వాత

...మిగతాది 2 లో

# రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం

- కాశ్మీర్ బంద్.. ఇంటర్నెట్ స్పీడ్ పై పరిమితులు
- శాంతిభద్రతలను కాపాడటానికి ముందు జాగ్రత్త చర్యగా మొబైల్ ఇంటర్నెట్ సేవలపై పరిమితులు
- పశ్చిమాసియాలో నివసిస్తున్న సుమారు 9 మిలియన్ల మంది భారతీయుల భద్రతపై CCS ప్రత్యేకంగా దృష్టి



**జయభేరి, న్యూఢిల్లీ, మార్చి 2 :**
ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం మూడో రోజుకు చేరింది. బాంబులు మోతతో ఇరాన్, ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాలు అట్టుడుకుతున్నాయి. ఇరాన్ సుప్రీం కమాండర్ ఖమేని మరణంతో అనేక దేశాల్లో షియాలు అధికంగా ఉండే ప్రాంతాల్లో

...మిగతాది 2 లో

# 15లోపు పట్టాలిస్తాం.. ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తాం

- మీ కన్నీరు తుడిచే బాధ్యత నాది.. మీకు అండగా నిలుస్తాం
- వెలుగుమట్ల నిర్వాసితులకు మంత్రి పొంగులేటి అభయం
- దళారుల 'దగా'పై ఉక్కుపాదం.. బాధితులకు 'సర్కారు' దన్ను
- ప్రతిపక్షాలపై మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి ధ్వజం




**జయభేరి, ఖమ్మం :**
అప్పులు చేసి నిర్మించుకున్న ఆశల గూడు కూలిపోయిందని ఆవేదన చెందకండి.. ఈ ప్రభుత్వం మీది. మీ కన్నీరు తుడిచే బాధ్యత నాది. అర్హులైన ప్రతి పేదవాడికి ఈ నెల 15వ తేదీలోపు ఇళ్ల స్థలాల పట్టాలతో పాటు రూ. 5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెలుగుమట్ల బాధితులకు భరోసానిచ్చారు. ఆదివారం ఖమ్మం ఐడిఓసి వేదికగా జరిగిన బాధితుల ముఖాముఖిలో మంత్రి వారి కష్టాలను స్వయంగా విని చలించిపోయారు.

**దళారుల నుంచి డబ్బులు వసూలు చేయించి ఇస్తామని హామీ**
వెలుగుమట్ల భూదాన్ భూముల్లో కొన్నేళ్లుగా దళారుల ఉచ్చులో చిక్కి, నిరుపేదలు అనుభవిస్తున్న నరకయాతన మంత్రి ఎదుట వెలుగుచూసింది. తక్కువ ధరకే స్థలం వస్తుందని నమ్మి, రెక్కాడితే గానీ డొక్కాడని తాము రూ. 30 వేల నుంచి రూ. 8 లక్షల వరకు అప్పులు చేసి దళారులకు చెల్లించామని మంత్రి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తీరా ఇల్లు కట్టుకున్నాక అధికారులు వచ్చి కూల్చేయడంతో తామంతా దిక్కుతోచని స్థితిలో పడ్డామన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి ఒక్క పైసా కూడా ఎవరికీ లంచం

...మిగతాది 2 లో

# ఢమాల్ అంటున్న మార్కెట్

- మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు
- ఆసియా మార్కెట్లు కూడా కుదేలు
- ఎగసిపడిన ఆయిల్ ధరలు
- భవిష్యత్తులో ఏం జరగొచ్చు?



**జయభేరి, ముంబై, మార్చి 2 :**
డాలాల్ స్ట్రీట్లో ఈ సోమవారం ఉదయం గట్టి షాక్ తగిలింది. అమెరికాఇరాన్ మధ్య పెరిగిన ఉద్రిక్తతలు గ్లోబల్ మార్కెట్లను కుదిపేయడంతో భారత స్టాక్ మార్కెట్లు కూడా భారీ పతనం చూశాయి. సోమవారం, 02 మార్చి 2026 ఉదయం BSE సెన్సెక్స్ 3.4% లేదా 2,743 పాయింట్ల భారీ నష్టంతో 78,543 వద్ద ప్రారంభమైంది. NSE నిఫ్టీ కూడా 2.06% or 519 పాయింట్ల పతనంతో 24,659 వద్ద ప్రారంభమైంది, 1 శాతం పైగా గ్యాప్‌డౌన్ అయింది.ప్రిఓపెన్ సెషన్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా కనిపించింది. ఉదయం 9:06 గంటలకు సెన్సెక్స్ 78,222.53 వద్ద

...మిగతాది 2 లో

# కవిత త్వరలో సొంతంగా రాజకీయ అడుగులు

- ఢిల్లీ లిక్కర్ స్కామ్ అనే కల్పిత గాథ వల్ల అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా బలి.. కేటీఆర్
- పార్టీ ఓటమిని తన ఖాతాలో వేయడంపై కవిత అసహనం వ్యక్తం
- "బీఆర్ఎస్ ఓటమికి నీ అహంకారమే కారణం, నాపై తప్పుడు ప్రచారాలు ఆపాలి".. కవిత


2 లో

# పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన రాహుల్ గాంధీ

- విజయవంతంగా ముగిసిన పది రోజుల "సంఘటన సృజన్ అభియాన్" శిక్షణ శిబిరం



**జయభేరి, వికారాబాద్, మార్చ్ 2 :**
వికారాబాద్ హరిత రిసార్ట్‌లో "సంఘటన సృజన్ అభియాన్" కార్యక్రమం భాగంగా నిర్వహించిన డీసీసీ అధ్యక్షుల పది రోజుల శిక్షణ శిబిరం ఘనంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాహుల్ గాంధీ, కేసి వేణు గోపాల్, సీఎం రేవంత్ రెడ్డి విచ్చేసి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ఏఐసీసీ


...మిగతాది 2 లో


2 లో

# వరుస ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- వాట్సప్ మనమిత్ర సేవలు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి
- అవినీతికి తావులేకుండా రాష్ట్రంలోని మొత్తం 295 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిజాయితీ కలిగిన అధికారులకే అవకాశం
- సీఎం చంద్రబాబు

# మహిళ హాస్టల్ నిర్మాణం చేయకుంటే పోరటమే



4 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## గ్రేటర్ ఎన్నికల్లో గెలవాల్సిందే

2014 లో అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రేటర్ హైదరాబాద్ నగరంపై గులాబీ పార్టీ పట్టు సాధించింది. 2016లో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికలో 150 డివిజన్లకు గాను 99 స్థానాలు బిఆర్ఎస్ గెలిచింది. 2020లో జరిగిన ఎన్నికల్లోను సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచి మేయర్, డిప్యూటీ మేయర్ స్థానాలను గెలిచింది. 2018, 2023 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోను గ్రేటర్ హైదరాబాద్ నగరంలో గులాబీ మెజారిటీ ఎమ్మెల్యే స్థానాలను సాధించింది. బిఆర్ఎస్ పార్టీ ప్రతిపక్షంలోకి వచ్చిన 2023లోను హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గులాబీ పార్టీ ఎక్కువ అసెంబ్లీ సీట్లు గెలిచి పట్టు నిలుపుకుంది. రాబోయే మూడు కార్పోరేషన్ల ఎన్నికలకు కేటీఆర్ వ్యూహాలు రచిస్తున్నారు. అందులో భాగంగానే గ్రేటర్ నేతలతో మీటింగ్ ఏర్పాటు చేసినట్లు చర్చ జరుగుతోంది. గ్రేటర్ పరిధిలో బిఆర్ఎస్ నుంచి గెలిచిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరినా మున్సిపల్ ఎన్నికల్లో తిరిగి బిఆర్ఎస్ పార్టీకి దగ్గర అయ్యారు. దీంతో ఎమ్మెల్యేలు పార్టీ మారిన అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో మెజారిటీ కార్పోరేటర్లు గెలిచే విధంగా గ్రౌండ్ లో ఉండాలని గులాబీ నేతలకు కేటీఆర్ ఆదేశాలు ఇచ్చారు. దీంతో లోక్ సభ ఎన్నికలతో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఓడిపోవడం గులాబీ పార్టీకి మైనస్ గా మారింది.

## ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తాం

ఇవ్వాల్సిన పనిలేదని, పేదల రక్తం తాగిన ఆ దళారుల నుంచి డబ్బును రికవరీ చేయిస్తామని బాధితులకు గట్టి హామీ ఇచ్చారు.

చీకటి బతుకుల నుంచి వెలుగు కాలనీల వైపు

గత 9 నెలలుగా కరెంటు, నీరు, ఇతర మౌలిక సదుపాయాలు లేక చీకట్లో మగ్గుతున్నామని బాధితులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి... కేవలం ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వడమే కాకుండా, కొత్తగా నిర్మించే కాలనీల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీతో పాటు అంగన్వాడీ, పాఠశాలలను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందని వివరించారు. నియోజకవర్గాల వారిగా బాధితులను గుర్తించి, వారి వారి ప్రాంతాల్లోనే గౌరవప్రదమైన పునరావాసం కల్పిస్తామని స్పష్టం చేశారు.

రాజకీయ శవాల మీద చిల్లర ఏరుకోవద్దు

అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో... బాధితుల సానుభూతి కోసం పాకులాడుతున్న ప్రతిపక్ష నేతలపై మంత్రి పొంగులేటి నిప్పులు చెరిగారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు ఈ పేదలు గుర్తుకు రాలేదా అని నిలదీశారు. అధికారం పోగానే షెడ్ల కింద కూర్చుని డ్రామాలు ఆడుతున్నారని, రాజకీయాల కోసం పేదలను కవచంలా వాడుకోవడం మూర్ఖత్వమని మండిపడ్డారు. మీ పార్టీ ఏదైనా సరే.. మీరు నిజమైన పేదలైతే ఈ ప్రభుత్వం మీకు ఇల్లు ఇచ్చి తీరుతుందని, రాజకీయాలకు అతీతంగా పారదర్శకమైన సర్వే ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ప్రకటించారు.

అర్హులకే పట్టా.. మార్చి 15 'డెడ్ లైన్'

గతంలో లబ్ధి పొందిన వారిని ఏరివేసి, కేవలం నిరుపేదలకే న్యాయం జరిగేలా సమగ్ర సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 15వ తేదీన తానే స్వయంగా వచ్చి అర్హులైన కుటుంబాలకు ఇళ్ల స్థలాల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్ల ఆర్డర్లు అందజేస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. అధికారులే నేరుగా బాధితుల వద్దకు వస్తారని, మరోమారు మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మట్టా దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం

ఆందోళనలు నిరసనలు జరుగుతున్నాయి. భారత్ లో శ్రీనగర్, లక్నో, హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఇవాళ కూడా పలు ప్రాంతాల్లో నిరసనలు జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా సైనిక దాడుల నేపథ్యంలో భారతదేశంలో మత హింస చెలరేగకుండా అప్రమత్తంగా ఉండాలని.. కేంద్ర హోంశాఖ రాష్ట్ర ప్రభుత్వాలను సూచనలు చేసింది. విదేశాలలో జరుగుతున్న పరిణామాలు దేశీయంగా ప్రభావితం చూపుతాయని, ముఖ్యంగా మతపరమైన సమావేశాలలో విద్వేష ప్రసంగాలు ఉండే అవకాశం ఉందని వాటిపై దృష్టిసారించాలని రాష్ట్రాలకు సూచించింది. స్థానికంగా అశాంతిని లేదా మతపరమైన ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ఇరాన్ అనుకూల రాడికల్ బోధకులు ఇచ్చే రెచ్చగొట్టే ప్రసంగాలను గుర్తించాలని, శాంతిభద్రతలకు భంగం కలగకుండా నివారించడానికి నిఘా సమాచారాన్ని పంచుకోవాలని, ఉద్రిక్త పరిస్థితుల నివారణ చర్యలను తీవ్రతరం చేయాలని రాష్ట్రాలను కోరింది. ఇప్పటికే ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా సంయమనం పాటించాలని భారత్ కోరింది. గల్ఫ్లో నివసిస్తున్న భారత పౌరుల భద్రత కోసం ఎప్పటికప్పుడు అడ్వైజరీలు జారీ చేస్తోంది.. ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు దేశంలో తీవ్రవాద శక్తులు స్థానిక ఉద్రిక్తతలను రెచ్చగొట్టడానికి ఉపయోగించుకునే అవకాశం ఉండటంతో అప్రమత్తమైన కేంద్రం దానికి అణుగుణంగా చర్యలు తీసుకుంటుంది.

కాశ్మీర్ బంద్.. ఇంటర్నెట్ స్పీడ్ పై పరిమితులు

ఇరాన్ సుప్రీం కమాండర్ హత్యకు నిరసనగా శ్రీనగర్లో బంద్ కొనసాగుతుంది. కాశ్మీర్ ప్రధాన మతాధికారి మిర్వైజ్ ఉమర్ ఫరూక్ పిలుపు మేరకు బంద్ జరుగుతోంది. అమెరికాఇజ్రాయెల్ సంయుక్త దాడిలో ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ హత్యకు సంతాపం తెలిపారు షియా ముస్లింలు.. ఖమేనీ హత్య నిరసనల నేపథ్యంలో కాశ్మీర్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలపై ఆంక్షలు విధించారు అధికారులు.. కాశ్మీర్ అంతటా మొబైల్ ఇంటర్నెట్ స్పీడ్ తగ్గించారు. శాంతిభద్రతలను కాపాడటానికి ముందు జాగ్రత్త చర్యగా మొబైల్ ఇంటర్నెట్ సేవలపై పరిమితులు విధించారు. కాశ్మీర్లో ఉన్న దాదాపు 15 లక్షల మంది షియాలు ఉన్నారు. నిన్న లాల్ చౌక్, సైదా కదల్, బుద్గామ్, బండిపోరా, అనంత్నాగ్ పుల్వామాలలో పెద్ద ఎత్తున ఖమేనీ మృతికి సంతాపంగా నిరసనలు జరిగాయి.. ఇవాళ కూడా పలు ప్రాంతాల్లో నిరసనలు జరిగే అవకాశం ఉండటంతో.. వాటిపై దృష్టిపెట్టాలని కేంద్రం రాష్ట్రాలను కోరింది..

ఎమర్జెన్సీ మీటింగ్

ఇజ్రాయెల్ఇరాన్ మధ్య యుద్ధం తీవ్రరూపం దాల్చడంతో పశ్చిమాసియా మొత్తం అల్లకల్లోలంగా మారింది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ప్రధాని మోదీ అధ్యక్షతన అత్యున్నత స్థాయి భద్రతా కేబినెట్ కమిటీ సమావేశం జరిగింది. రాజస్థాన్, గుజరాత్, తమిళనాడు పర్యటన ముగించుకుని న్యూఢిల్లీకి చేరుకున్న కాసేపటికే ప్రధాని మోదీ ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ అత్యున్నత స్థాయి సమావేశంలో దేశ భద్రత, వ్యూహాత్మక విషయాలపై ప్రధానంగా చర్చించారు. పశ్చిమాసియాలో నివసిస్తున్న సుమారు 9 మిలియన్ల మంది భారతీయుల భద్రతపై CCS ప్రత్యేకంగా దృష్టిసారించింది. ముఖ్యంగా ఇజ్రాయెల్లోని 40,000 మంది, ఇరాన్లోని 10,000 మంది భారతీయుల పరిస్థితిని సమీక్షించారు. యుద్ధ ఉద్రిక్తతల వల్ల విమాన సేవలు నిలిచిపోయి, దుబాయ్ వంటి విమానాశ్రయాలలో చిక్కుకుపోయిన వందలాది మంది భారతీయులను సురక్షితంగా తరలించే అంశంపై చర్చించారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల అనంతరం ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ మరణంతో తలెత్తిన తాజా పరిస్థితులను ఉన్నతాధికారులు కమిటీకి వివరించారు. ఈ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్లతో పాటు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ పాల్గొన్నారు. భారత చమురు వాహక సంస్థలకు ప్రధాన మార్గమైన హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడం వల్ల చమురు సరఫరాకు అంతరాయం ఏర్పడే ప్రమాదంపై కూడా కమిటీ చర్చించింది. పశ్చిమాసియాలోని భారత రాయబార కార్యాలయాలు స్థానిక భారతీయులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయని, హెల్ప్లైన్లను అందుబాటులో ఉంచామని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. మునుపటి ఘర్షణల సమయంలో మాదిరిగానే, ఈసారి కూడా భారతీయులను సురక్షితంగా తరలించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వర్గాలు తెలిపాయి.

# ముగిసిన ఖమేని శకం



**"ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన సంయుక్త వైమానిక దాడుల్లో మరణించినట్లు ఇరాన్ ప్రభుత్వ అధికారిక మీడియా ధృవీకరించింది. టెహ్రాన్‌లోని ఆయన నివాసం లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో ఖమేనీతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, కీలకమైన సైనిక నాయకులు కూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ వార్త ధృవీకరణ కావడంతో ఇరాన్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా 40 రోజుల సంతాప దినాలను ప్రకటించింది.**

దశాబ్దాల కాలం పాటు ఇరాన్ రాజకీయ, సైనిక వ్యవస్థను శాసించిన ఒక శకం దీనితో ముగిసింది. ఖమేనీ మరణంతో అమెరికా, ఇజ్రాయెల్ పంతం నెగ్గినట్లయింది. అయితే యుద్ధం ముగిసిపోతుందా అంటే చెప్పడం కష్టం. ఖమేనీ చనిపోయినా ఇరాన్ లొంగిపోయే అవకాశాలు కనిపించడం లేదు. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం, నాయకత్వ బాధ్యతలను తాత్కాలికంగా ముగ్గురు సభ్యుల కౌన్సిల్ స్వీకరించింది. కానీ క్షేత్రస్థాయిలో పట్టున్న ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రతీకారేచ్ఛతో ఉంది. ఇప్పటికే అమెరికా స్థావరాలపై, ప్రాంతీయ మిత్రదేశాల లక్ష్యాలపై ఇరాన్ క్షిపణి దాడులను ముమ్మరం చేసింది. నాయకత్వ శూన్యతను పూడ్చుకునే క్రమంలో ఇరాన్ మరింత దూకుడుగా వ్యవహరించే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియా విశ్లేషిస్తోంది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఆపరేషన్‌ను ధ్యప్రాచ్యంలో శాంతి స్థాపనకు లభించిన గొప్ప అవకాశంగా అభివర్ణించారు. ఇరాన్ పాలనలో మార్పు రావాలని అమెరికా ఆశిస్తున్నారు. అంటే లొంగిపోవాలని ఆయన కోరుకుంటున్నారు. కానీ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తమ ఆపరేషన్ ఇంకా ముగియలేదని, ఇరాన్ అణు , క్షిపణి వ్యవస్థలే తదుపరి లక్ష్యాలని స్పష్టం చేశారు. ఈ పరిణామం వల్ల మధ్యప్రాచ్యం ఒక్కసారిగా అనిశ్చితిలోకి వెళ్లిపోయింది. దుబాయ్, బహ్రెయిన్ వంటి వాణిజ్య కేంద్రాలపై దాడులు పెరిగే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.ప్రస్తుతం ఇరాన్ తన తదుపరి వారసుడిని ఎన్నుకునే ప్రక్రియలో ఉంది. ఖమేనీ కుమారుడు వారసుడు అయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే అమెరికా ప్రోద్బలంతో అధికార మార్పిడి సజావుగా సాగదని.. అంతర్గత తిరుగుబాట్లకు దారితీసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఇరాన్ లోపల అంతర్యుద్ధం వంటి పరిస్థితులు తలెత్తితే, అది ప్రపంచ చమురు సరఫరాను , ఆర్థిక వ్యవస్థను కోలుకోలేని విధంగా దెబ్బతీస్తుంది. యుద్ధం ఆగిపోవడానికి బదులు, ఇది ఒక సుదీర్ఘమైన ప్రాంతీయ సంఘర్షణకు ఆరంభంగా మారుతుందేమోనన్న భయం గల్ఫ్ దేశాల్లో నెలకొంది. అందుకే ఖమేనీ అంతంతో అన్నీ అయిపోలేదు.. అసలు సమస్యలు ముందున్నాయని ప్రపంచదేశాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై క్షిపణులతో విజృంభించాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని హతమర్చాయి. ఖమేనీ కూతురు, అల్లుడి కూడా ఈ దాడుల్లో మరణించినట్లు ఇరానీ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఖమేనీ మరణంతో పాటు 40 రోజుల పాటు సంతాప దినాలు ప్రకటిస్తున్నట్లు ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. శనివారం మధ్యాహ్నం నుంచి మొదలైన యుద్ధం నిర్విరామంగా కొనసాగుతోంది. ఖమేనీని హతమార్చుతామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత కొంతకాలంగా ప్రకటిస్తూ వస్తోన్నారు. చివరికి ఇజ్రాయెల్‌తో కలిసి తన శపథాన్ని ట్రంప్ నెరవేర్చుకున్నారు. అయితే ఇరాన్ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలతో ప్రపంచ మార్కెట్లు కుదేలవుతున్నాయి. బంగారం, వెండి ధరలు మండిపోతున్నాయి. ఖమేనీ మరణంతో యుద్ధం మరింత ముదిరే అవకాశముంది. గల్ఫ్ దేశాలైన దుబాయ్, ఖాతార్, అబుదాబిపై ఇరాన్ ప్రతీకార దాడులకు పాల్పడుతోంది. గల్ఫ్ దేశాలపై కూడా యుద్ధ ప్రభావం పడటంతో ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో బంగారం ధరలు సోమవారం రికార్డ్ దిశగా దూసుకెళ్లే అవకాశముందని మార్కెట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైన కొద్ది సేపటికే ముందుగా క్రిప్టో కరెన్సీలపై దీని ప్రభావం పడింది. బిట్ కాయిన్ 5 శాతం పడిపోయి 64 వేల డాలర్ల మార్క్ కంటే దిగువకు పడిపోయింది. యుద్ధ ప్రభావంతో సోమవారం నుంచి మార్కెట్లు అస్థిరంగా ఉండవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ఇక పసిడి ధరలు సరికొత్త రికార్డులు సృష్టించచొచ్చని చెబుతున్నారు.ఇక ఇరాన్ఇజ్రాయెల్ మధ్య యుద్ధం, అమెరికా కూడా యుద్ధంతో పాల్గొనడంతో ముడి చమురు ధరలు పెరిగే అవకాశం కనిపిస్తోంది. యుద్ధ ప్రభావం వల్ల ఇరాన్‌లో చమురు సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఈ క్రమంలో ముడి చమురు ధర బ్యారెల్‌కు 80 డాలర్లు దాటి వెళ్లవచ్చని అంటున్నారు. ఇజ్రాయెల్ అమెరికా దాడులతో ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హార్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్త వాతావరణ నెలకొంది. భారత్ తన క్రూడ్ ఆయిల్ దిగుమతుల్లో సగానికి పైగా పైగా ఈ జలసంధి నుంచే తీసుకువస్తోంది. దీంతో ఈ అంశం తీవ్ర ఆందోళనలు కలిగిస్తోంది. ఇక్కడ రవాణాకు ఏ మాత్రం ఆంటంకం ఏర్పడినా ఇంధన, సరకు రవాణా వ్యయాలు భారీగా పెరుగుతాయి. భారత ఆర్థిక వ్యవస్థపై ఇది పెను భారాన్ని మోపనుంది.ముడి చమురు ధరలు పెరిగితే భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. దీంతో దేశవ్యాప్తంగా సరకు రవాణా ఖర్చులు పెరిగేందుకు అవకాశం ఉంది. ఎర్ర సముద్రంలో భద్రత లేకపోతే నౌకలు ఆఫ్రిగా మీదుగా ప్రయాణించాల్సి వస్తుంది. దీంతో సరకు రవాణా సమయం 1520 రోజులు అవుతుంది. దీంతో ఖర్చు 50 శాతం వరకు పెరుగుతంది. ఇవన్నీ అంతిమంగా వినియోగదారుడిపైనే పడతాయి. ఇదే కాకుండా ఇరాన్, ఇజ్రాయెల్, కువైట్ తదితర దేశాల గగనతలాలు పాక్షికంగా మూసివేశారు. దీంతో ఎయిర్ ఇండియా, ఇండిగో విమాన కంపెనీలు అమెరికా, ఐరోపా రూట్లను మళ్లించాయి. దీంతో ఇంధ ఖర్చుల ప్రభావం కనిపిస్తుంది. దీంతో విమాన టికెట్ల ధరలు భారీగా పెరగవచ్చు. ప్రస్తుతం బ్యారెల్‌కు బ్రెంట్ క్రూడ్ 70 డాలర్ల కంటే ఎక్కువగా ఉంది. ఈ వారంలో ధరలు మరింత పెరిగితే పెట్రోల్, డీజిల్ ధరలపై ప్రభావం చూపవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. భారతదేశం ముడి చమురును 80 శాతం వరకు విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది.

## సొంతంగా రాజకీయ అడుగులు

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో సుదీర్ఘ కాలం సాగిన ఉత్కంఠకు రౌస్ అవెన్యూ కోర్టు తీర్పుతో తెరపడింది. మాజీ ఎమ్మెల్సీ కవితకు ఈ కేసులో క్లీన్ చిట్ లభించడం బీఆర్ఎస్ శ్రేణులకు పెద్ద ఊరటనిచ్చినప్పటికీ, ఈ తీర్పు అనంతరం చోటుచేసుకున్న పరిణామాలు పార్టీలోనూ, కల్వకుంట్ల కుటుంబంలోనూ పెను తుపానును సృష్టించాయి. ముఖ్యంగా కేటీఆర్ చేసిన ఒక ట్వీట్, దానికి కవిత ఇచ్చిన కౌంటర్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయికోర్టు తీర్పు వెలువడిన వెంటనే కేటీఆర్ స్పందించారు. ఈ కేసు కేవలం రాజకీయ కక్ష సాధింపు అని కొట్టిపారేశారు. అయితే, తన విశ్లేషణలో ఆయన ఒక కీలక వ్యాఖ్య చేశారు. "ఢిల్లీ లిక్కర్ స్కామ్ అనే కల్పిత గాథ వల్ల అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా బలి అయింది" అని పేర్కొన్నారు. కవితకు న్యాయం జరిగిందని చెబుతూనే, ఈ కేసు వల్లే పార్టీ ఓడిపోయిందనే అర్థం వచ్చేలా ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. కేటీఆర్ చేసిన విశ్లేషణపై కవిత తీవ్రంగా మండిపడ్డారు. పార్టీ ఓటమిని తన ఖాతాలో వేయడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. "బీఆర్ఎస్ ఓటమికి నీ అహంకారమే కారణం, నాపై తప్పుడు ప్రచారాలు ఆపాలి" అంటూ ఆమె ఎక్స్ వేదికగా ఘాటుగా స్పందించారు. తాను జైలులో ఉన్న సమయంలో పార్టీ గానీ, అగ్ర నాయకత్వం గానీ కనీసం ఒక ప్రెస్ మీట్ పెట్టి కూడా తనకు అండగా నిలవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు తన వ్యక్తిగత లాభం కోసం జరిగింది కాదని, పార్టీ ప్రయోజనాల కోసం పోరాడుతుంటే తనను ఒంటరిని చేశారని ఆమె ఆరోపించారు. నిరుద్యోగం, హామీల అమలులో వైఫల్యం వంటి కారణాల వల్ల పార్టీ ఓడిపోతే, ఇప్పుడు ఆ నెపాన్ని తనపైకి నెట్టడం సరికాదని ఆమె స్పష్టం చేశారు.ఈ వివాదం కేవలం అన్నాచెల్లెళ్ల మధ్య చిన్నపాటి ఘర్షణ మాత్రమే కాదు, దీని వెనుక లోతైన రాజకీయ కోణాలు ఉన్నాయి. కేసు గెలిచిన తర్వాత కవిత తన రాజకీయ ఇమేజ్‌ను తిరిగి పుంజుకోవాలని చూస్తున్నారు. కానీ కేటీఆర్ వ్యాఖ్యలు ఆమెను పార్టీకి నష్టం కలిగించిన వ్యక్తిగా చిత్రించేలా ఉన్నాయని ఆమె భావిస్తున్నారు. కవిత త్వరలో సొంతంగా రాజకీయ అడుగులు వేయబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఆమె తనపై ఉన్న లిక్కర్ స్కామ్ ముద్రను కోర్టు ద్వారా చెరిపేసుకున్న తరుణంలో, సొంత అన్నయ్యే దాన్ని పార్టీ ఓటమికి కారణంగా చూపడం ఆమెకు మింగుడుపడటం లేదు.లిక్కర్ స్కామ్ కేసులో న్యాయపరంగా కవిత విజయం సాధించినా, రాజకీయంగా మాత్రం కుటుంబంలో చిచ్చు రేపింది. కేటీఆర్ అహంకారం వల్ల ఓడిపోయామని కవిత, కవిత కేసు వల్లే పార్టీ దెబ్బతిందని కేటీఆర్ పరోక్షంగా వాదించుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మరి ఢిల్లీ లిక్కర్ స్కాంలో క్లీన్ చిట్ వచ్చిన తర్వాత కూడా అన్నాచెల్లెళ్లు ఇలా బహిరంగంగా విమర్శించుకోవడం ఆసక్తి రేపుతోంది.

## పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

సెక్రటరీ సచిన్ సావంత్,తదితరులు పాల్గొన్నారు. పది రోజులపాటు కొనసాగిన ఈ శిక్షణ శిబిరంలో పార్టీ సంస్థాగత బలోపేతం, నాయకత్వ సామర్థ్యాల అభివృద్ధి, ప్రజలతో అనుసంధానం, ఎన్నికల వ్యూహరచన వంటి అంశాలపై సమగ్ర చర్చలు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన డీసీసీ అధ్యక్షులు తమ తమ జిల్లాల రాజకీయ పరిస్థితులు, బూత్ స్థాయి నిర్మాణం, ప్రజా సమస్యలపై పార్టీ స్పందన తదితర అంశాలను విశ్లేషిస్తూ అనుభవాలను పంచుకున్నారు. "సంఘటన సృజన్" ప్రోగ్రామ్ చైర్మన్ సచిన్ రావ్ ఆధ్వర్యంలో, ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా వంశీ చందర్ రెడీ, ఎమ్మెల్యే పరిగి రాంమోహన్ రెడ్డి నేతృత్వంలో ఈ శిబిరం సమర్థవంతంగా నిర్వహించబడింది. వివిధ రంగాల నిపుణులు నాయకత్వ నైపుణ్యాలు, ప్రజా సమస్యల పరిష్కార విధానాలు, సోషల్ మీడియా & మీడియా నిర్వహణ, ఎన్నికల వ్యూహరచన, కార్యాచరణ ప్రణాళికల రూపకల్పన వంటి అంశాలపై శిక్షణ అందించారు. రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో శిక్షణా శిబిరం ముగిసింది.

## సొంతూరుకు విరోషి

తన భార్య రష్మికతో కలిసి ఫస్ట్ టైం సొంతూరికి రావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. తన చిన్ననాటి స్నేహితులు అందరినీ ఆప్యాయంగా పలకరించారు విజయ్. తుమ్మనపేటలో నూతనగా నిర్మించిన ఫామ్ హౌస్లో గృహ ప్రవేశం నిర్వహించారు. ఆ తర్వాత కొత్త దంపతులతో నూతన గృహంలో సత్య నారాయణ వ్రతం జరిపించారు. ఈ వేడుకలో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. తన గ్రామస్థుల సమక్షంలోనే ఈ వేడుక జరగాలని విజయ్ భావించగా... కొత్త జంట సంబరంతో గ్రామంలో సందడిగా మారింది. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.రాజస్థాన్లోని ఉదయపూర్లో ఫిబ్రవరి 26న విజయ్ దేవరకొండ, రష్మిక వివాహ బంధంతో ఒక్కటయ్యారు. ఆ తర్వాత హైదరాబాద్ చేరుకున్న వీరు దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో అభిమానులకు స్వీట్స్ పంపిణీ చేశారు. ఏపీ, తెలంగాణ సహా ప్రముఖ ఆలయాల్లో అన్నదానం కూడా చేశారు. వీరి అభిమానులు సైతం పలు గ్రామాల్లో అన్నదానం నిర్వహించారు.హైదరాబాద్లోని తాజ్ హోటల్లో మార్చి 4న వివాహ రిసెప్షన్ జరగనుంది. టాలీవుడ్ టాప్ సెలబ్రిటీలతో పాటు పొలిటికల్ లీడర్స్ ఈ వేడుకకు హాజరు కానున్నారు. ఆదివారం రష్మిక తెలంగాణ సీఎం రేవంత్ ఫ్యామిలీని కలిసి రిసెప్షన్కు ఆహ్వానించారు. అలాగే, విరోష్ కపుల్ స్వయంగా అల్లు అరవింద్ ఇంటికి వెళ్లి వారి ఫ్యామిలీని ఆహ్వానించారు. కొత్త పెళ్లి కొడుకు అల్లు శిరీష్కు విషెష్ తెలిపారు. రిసెప్షన్ సందర్భంగా ఫ్యాన్స్కు స్పెషల్ రిక్వెస్ట్ చేశారు. ఆహ్వానం ఉన్న అతిథులు మాత్రమే ఈవెంట్కు రావాలని విరోష్ కపుల్ విజ్ఞప్తి చేశారు. ఆహ్వానం లేకుండా వచ్చి ఇబ్బంది పడొద్దని సూచించారు. పోలీసుల ఆంక్షల నేపథ్యంలో ఇతరులు, అభిమానులు ఈ కార్యక్రమానికి వచ్చి ఇబ్బందుల పాలు కావొద్దని తెలిపారు.

## ఢమాల్ అంటున్న మార్కెట్

ఉంది, 3,064 పాయింట్ల నష్టాన్ని చూపింది. అదే సమయానికి నిఫ్టీ 24,630.80వద్ద 2 శాతం పైగా నష్టంతో కనిపించింది.విస్తృత మార్కెట్ సూచీలు కూడా లోయర్ లెవెల్స్లో ట్రేడవుతున్నాయి, నిఫ్టీ మిడ్క్యాప్ 100 దాని మునుపటి ముగింపు 59,115.60తో పోలిస్తే ఇవాళ 57,090.80 వద్ద ప్రారంభమైంది. నిఫ్టీ స్మాల్క్యాప్100 దాని మునుపటి ముగింపు 16,928.90కంటే 16,289.60వద్ద ప్రారంభమైంది. సెగ్మెంట్లలో నిఫ్టీ రియాల్టీ అతి పెద్ద నష్టాలను మిగిల్చింది. దీని తర్వాత నిఫ్టీ మీడియా, నిఫ్టీ ఆయిల్ & గ్యాస్ సూచీలు దిగజారాయి.

వారాంతంలో అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్పై దాడులు జరిపింది. ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీ మరణించారు. దీనికి ప్రతిగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పరిణామాలతో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు 'రిస్క్ ఆఫ్' మూడ్లోకి వెళ్లిపోయారు. సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతున్నారు. జపాన్ నిక్కీ 225 దాదాపు 2.7 శాతం పడిపోయింది. దక్షిణ కొరియా కోస్పీ 2.43 శాతం నష్టపోయింది. అమెరికా ఫ్యూచర్స్ కూడా బలహీన సంకేతాలిచ్చాయి. గ్లోబల్ సెంటిమెంట్ ఎంత బలహీనంగా ఉందో ఇవి చూపిస్తున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్కు 72.87 డాలర్లకు చేరింది, ఒకేసారి 2.87 శాతం పెరిగింది. భారత్, తన క్రూడ్ అవసరాల్లో దాదాపు 85 శాతం దిగుమతి చేసుకుంటుంది. ఆయిల్ ధరలు ఎక్కువకాలం పెరిగి ఉంటే, ఆ ప్రభావం వాణిజ్య లోటు, ద్రవ్యోల్బణం, రూపాయి విలువపై పడే అవకాశం ఉంది. ఆర్థిక నిపుణుల ప్రకారం... ఆయిల్ ధరలు స్థిరంగా పెరిగితే ద్రవ్యోల్బణం పెరగవచ్చు. ప్రభుత్వ ఆర్థిక లోటు కూడా పెరుగుతుంది. హోలీ సందర్భంగా మార్కెట్లు మూసివేస్తారు. అందుకే, తక్కువ పని రోజులు ఉన్న ఈ వారంలో ఎక్కువ అస్థిరత ఉండొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. దేశీయంగా మూడో త్రైమాసిక GDP గణాంకాలు, ఆటో సేల్స్ డేటా, IIP, PMI వంటి డేటా రిలీజ్లు మార్కెట్ దిశను ప్రభావితం చేయొచ్చు. విదేశీ పెట్టుబడుల ట్రెండ్ కూడా కీలకం. గత వారంలో సెన్సెక్స్ 1,527 పాయింట్లు పడిపోయింది. నిఫ్టీ 392 పాయింట్లు నష్టపోయింది. టెక్నాలజీ షేర్లలో బలహీనత, గ్లోబల్ అనిశ్చితి ఇప్పటికే మార్కెట్ను ఒత్తిడిలోకి నెట్టాయి.

మధ్యప్రాచ్య పరిస్థితులు మరింత విషమిస్తే మార్కెట్లలో అస్థిరత కొనసాగవచ్చు. ఆయిల్ ధరలు ఇంకా పెరిగితే భారత ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరగొచ్చు. ఇలాంటి సమయంలో పెట్టుబడిదారులు టెన్షన్ పడకుండా దీర్ఘకాల దృష్టితో నిర్ణయాలు తీసుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

## వరుస ప్రమాదాలపై అప్రమత్తం

ఆర్టీజీఎస్, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్పై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ నెల నుంచి కనీసం 80 శాతం నుంచి 90 శాతం తగ్గకుండా పబ్లిక్ పర్సెప్షన్ ఉండాలని స్పష్టం చేసారు. పెన్షన్ల పంపిణీలో లోటుపాట్లు తలెత్తుతున్న స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. పెన్షన్ల విషయంలో అట్టడుగు స్థానంలో ఉన్న చోట కూడా సమర్థంగా పంపిణీ జరిగేలా చూడాలి. దీపం పథకం కింద ఇస్తున్న గ్యాస్ సిలిండర్ల డెలివరీకి డబ్బులు వసూలు చేయకుండా కఠినంగా వ్యవహరించాలని అన్నారు. ఆర్టీసీ బస్సు సర్వీసులు బావున్నా... ఆర్టీసీ బస్ స్టేషన్లో సౌకర్యాలు, ఔట్ సోర్సింగ్ సర్వీసులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలి . పుంగనూరు, వెంకటగిరి, పెనుకొండ, ప్రొద్దుటూరు, ఎమ్మిగనూరు, శ్రీకాళహస్తి బస్ స్టేషన్లో తాగునీరు, టాయిలెట్స్, ఫ్యాన్స్, సీటింగ్ ఏరియాపై ప్రయాణికుల నుంచి అసంతృప్తి వస్తోంది. మొత్తం రాష్ట్రంలోని అన్ని బస్టేషన్లో టాయిలెట్స్ మరమ్మతులు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో వరుస ప్రమాదాలు, సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలి. బాణసంచా పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలపై శివకాశీకి వెళ్లి అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్, డిజిటల్ సేవలు, సిబ్బంది ప్రవర్తనపై సంతృప్తి వ్యక్తమైందని అధికారులు వివరించారు.

# విద్యే భవిష్యత్తుకు బాటలు వేసే ప్రధాన ఆయుధం

**జయభేరి, ఉప్పల్ :**



ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించేందుకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు 11 మంది విద్యార్థులకు దాదాపు 6 లక్ష రూపాయల చెక్కులు అందజేయడం జరిగింది. ఉప్పల్ డీసీ కార్యాలయంలో డీసీ రాజు చేతుల మీదుగా ఎంబీబీఎస్ చెక్కులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, విద్యే భవిష్యత్తుకు బాటలు వేసే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన ప్రతిభావంతమైన విద్యార్థులకు BLR చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలుస్తుంది అని ఆయన అన్నారు. వైద్య విద్య అభ్యసిస్తూ భవిష్యత్తులో సమాజానికి సేవ చేసే వైద్యులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, ఉప్పల్ BRS పార్టీ నాయకులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఎంబీబీఎస్ విద్యార్థులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.


# రాహుల్ గాంధీతో బీర్ల కుటుంబం

- కాంగ్రెస్ పార్టీ పటిష్టత, రాజకీయ పరిణామాలపై రాహుల్ తో మాటామంతీ
- చారిత్రక గుర్తుగా రాహుల్ తో బీర్ల అయిలయ్య కుటుంబ సభ్యుల ఫోటో

**జయభేరి, యాదగిరిగుట్ట:**




ఒక సామాన్య కుటుంబంలో పుట్టి పెరిగి... రాజకీయ నాయకుడిగా,ప్రజాప్రతినిధిగా ఒక్కొక్క మెట్టు ఎదిగి.. ఆలేరు శాసన సభ్యునిగా, ప్రభుత్వ విప్ గా..యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా.. వరుస ఎన్నికలలో విజయ ఢంకా మోగిస్తూ బలమైన నాయకునిగా... బీసీ నాయకునిగా ఎదిగిన బీర్ల ఐలయ్య ఏకంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీతో ఒకరోజు గడపమే కాకుండా...సోమవారం తాను,తన కుటుంబ సభ్యులతో కలిసి రాహుల్ గాంధీ పక్కన కూర్చుని దిగిన ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. కాంగ్రెస్ పార్టీ శ్రేణులను, ఆయన అభిమానులను, శ్రేయోభిలాషులను ఆనందం వ్యక్తం చేశారు. రాహుల్ తో బీర్ల అయిలయ్య మాటామంతీ... వికారాబాద్ హరిత రిసార్ట్ జరుగుతున్న ఉభయ తెలుగు రాష్ట్రాల డిసిసి అధ్యక్షుల శిక్షణ శిబిరంలో ముగింపు రోజు చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. దాదాపు 75 మంది డిసిసి అధ్యక్షులు శిక్షణ పొందారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీతో బీర్ల అయిలయ్య కుటుంబ సభ్యులు. మర్యాదపూర్వకంగా కలిశారు... గుర్తుగా ఫోటో దిగారు. భేటీ సందర్భంగా సంస్థగతంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం,భవిష్యత్ కార్యాచరణ,రాజకీయ పరిణామాలు,ప్రజా సేవలో నాయకుల పాత్ర వంటి అంశాలపై ఉభయుల మధ్య సానుకూల చర్చలు జరిగినట్లు తెలుస్తోంది.



## హోలీ పండుగపై సందిగ్ధం!

- నేడా... రేపా..
- హోలీ పండుగ పై చంద్రగ్రహణం ఎఫెక్ట్

**జయభేరి, దేవరకద్ర :**

చంద్రగ్రహణం కారణంగా హోలీ పండుగను ఎప్పుడు జరుపుకోవాలా.. అని ప్రజలు సందిగ్ధంలో పడ్డారు. నిజానికి హోలీ పండుగను మంగళవారం జరుపుకోవాలి.. కానీ ఆరోజు చంద్రగ్రహణం ఉంది. దీంతో చంద్రగ్రహణం రోజు హోలీ పండుగను జరుపుకోవాలా.. లేదా మరుసటి రోజు జరుపుకోవాలా.. అని ప్రజల తికమక పడుతున్నారు. చంద్రగ్రహణం రాత్రివేళ ఉంటుంది పగలు పండుగలు చేసుకోవచ్చు అని కొందరు.. లేదు.. లేదు.. పగలు కూడా చేసుకోరాదని మరికొందరు.. ఇలా ఎవరికి తోచినట్లు వారు చెబుతున్నారు. ఏది ఏమైనా చంద్రగ్రహణం ఎఫెక్ట్ హోలీ పండుగ వేడుకలపై పడింది. దీని కారణంగా ఈ ఏడాది హోలీ పండుగను రెండు రోజులపాటు చేసుకోవాల్సి వస్తుంది.

# కాలనీ చెంతనే పింఛన్ల పంపిణీకి శ్రీకారం

- 9వ వార్డు పింఛన్ దారుల కష్టాలు గట్టెక్కినట్లే
- కౌన్సిలర్ సాధునేని ధనలక్ష్మి-మధుకర్ కు పింఛన్ దారులు ధన్యవాదాలు


**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 2 :**




యాదగిరిగుట్ట మున్సిపాలిటీ ప్రశాంత్ నగర్ 9వ వార్డులో సంక్షేమ పథకాలు అమలు వేగవంతంగా సాగుతోంది. ఇందులో భాగంగా, యాదగిరిగుట్ట మున్సిపల్ 9వ వార్డు కౌన్సిలర్ సాదునేని ధనలక్ష్మిమధుకర్ ఆధ్వర్యంలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం అత్యంత పకడ్బందీగా నిర్వహించారు. గతంలో యాదగిరిపల్లి పోస్ట్ ఆఫీస్ వద్ద పింఛన్లు ఇచ్చేవారు దీంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వారు నివసిస్తున్న ఇంద్ర కాలనీ వద్దనే పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి ప్రజల చేత శభాష్ అనిపించుకున్నారు. అంగన్ వాడీ పూర్వ ప్రాథమిక పాఠశాల వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ ధనలక్ష్మిమధుకర్ స్వయంగా పాల్గొని, లబ్ధిదారులకు పింఛన్ నగదును అందజేశారు.

ప్రశాంత్ నగర్,ఇందిరా కాలనీ ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, చేతి వృత్తుల వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా 9వ వార్డు కౌన్సిలర్ సాధునేనిధనలక్ష్మి మధుకర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా పేదలు,వృద్ధుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని,ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ ఫలాలు నేరుగా అందేలా సమస్యలను అభివృద్ధి పనులతో పాటు సామాజిక భద్రత కల్పించడంలో యాదగిరిగుట్ట మున్సిపల్ 9వ వార్డు కౌన్సిలర్ ధనలక్ష్మి మధుకర్ చూపుతున్న చొరవపై ఇంద్రకాలనీ వాసులు ప్రశంసలు కురిపిస్తున్నారు. తమకు కష్టకాలంలో ఆసరాగా నిలుస్తున్న కౌన్సిలర్ పట్ల లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంద్ర కాలనీ ప్రతినిధులు, 9వ వార్డు నాయకులు, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కురుమూర్తిలో దర్శనాలు నిలిపివేత



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్నచింతకుంట మండలం శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానంలో చంద్రగ్రహం కారణంగా మంగళవారం భక్తుల దర్శనాలను చేస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు దర్శనాలను చంద్రగ్రహణం కారణంగా నిలిపి వేస్తున్నామన్నారు. ఈ విషయంలో భక్తులు దేవస్థానానికి సహకరించాలని ఆయన కోరారు. చంద్రగ్రహణం తర్వాత దేవస్థానం శుద్ధి అనంతరం మళ్లీ యధావిధిగా దేవస్థానంలో భక్తుల దర్శనాలను అనుమతిస్తున్నట్లు గోవర్ధన్ రెడ్డి తెలిపారు.

# ప్రతి ఒక్కరు శ్రీశ్రీశ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆశీస్సులు పొందాలి

- అంగ రంగ వైభవంగా తీదేడు శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**జయభేరి, చింతపల్లి :**



ప్రతి ఒక్కరు శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆశీస్సులు పొందాలని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు. శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు అంగరంగ వైభవంగా జరుగుతుయన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధ్యాత్మిక చరిత్రకు ప్రతీకగా నిలిచిన శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఈ సంవత్సరం కూడా వైభవంగా బ్రహ్మోత్సవాలకు ముస్తాబయిందన్నారు. దేవస్థానం పరిసరాలు విద్యుత్ దీపాలతో, పుష్పాలతో అలంకరించబడగా,గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొన్నదన్నారు. శ్రీ రామలింగేశ్వర స్వామి వారిని విశ్వకర్మ భజన బృందం,డప్పు చప్పులతో ఊరేగింపుగా గుట్ట ఎక్కుటతో పాటు కామదహనం జరిగిందన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు, నిత్య అన్నదానం, రథోత్సవం మహోత్సవం జరుగునన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సదుపాయం, ఉచిత అన్న ప్రసాదం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్, ఆలయ అర్చకులు సురభి సత్యనారాయణ శర్మ సోదరులు, సురభి ప్రభాకర్ శర్మ,మాజీ ఉప సర్పంచ్లు ధరణిపతి రమణారావు, ఉలుపాల శేఖర్ రెడ్డి, సోనగంటి గొవర్ధనాచారి, మాజీ పి.ఏ.సి.యస్ డైరెక్టర్ తిరుమణి పాపయ్య, గ్రామ పాలక వర్గం వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి, మాదగోని కృష్ణ గౌడ్, గంటెల అలివేలు సోమయ్య, దాసరి కళమ్మ ముత్తయ్య, రెడ్డి పద్మ పరమేష్,సందె లక్ష్మయ్య, మర్ల యాదగిరి, శివర్ల పర్వతాలు, గ్రామ పెద్దలు మర్రు రామారావు, మోర కిరణ్, జూలూరి శ్రీధర్, గ్రామ ప్రజలు, గ్రామ యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## యాదగిరిగుట్టలో ఘనంగా వసంతోత్సవం

**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 02 :**

శ్రీ పంచ నారసింహ క్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో ఘనంగా వసంతోత్సవం జరిగింది. మంగళవారం చంద్రగ్రహణం కారణంగా హోలీని సోమవారం నిర్వహించారు. ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుంటూ వేడుకలు జరుపుకున్నారు. కాగా ఆలయంలో ఉత్సవమూర్తులకు వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవంలో ఆలయ ప్రధానార్చకులు కాండూరి వేంకటాచార్యులు పాల్గొని వసంతోత్సవ పూజలు నిర్వహించారు. అనంతరం వేడుక విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం ఆలయ అధికారులు,సిబ్బంది కామదహన కార్యక్రమము నిర్వహించారు.

## ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా చూడాలి

- మున్సిపల్ సిబ్బందికి చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణి-భరత్ గౌడ్

**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 02 :**

వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని యాదగిరిగుట్ట పట్టణ ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా చూడాలని యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్ ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ లింగస్వామితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని,అంతేకాకుండా యాదగిరిగుట్ట పట్టణంలో పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని ఆదేశించారు. నీటి సరఫరా, పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వహించొద్దని సూచించారు. తాగునీటి పైప్‌లైన్లు పగిలినా, యాదగిరిగుట్ట పట్టణంలోని నీటి సమస్య ఉన్నా వెంటనే ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని, త్వరితగతిన పగిలిన పైప్‌లైన్లు రిపేరు చేయించాలన్నారు. ప్రజలకు వాటర్ మెన్, పారిశుద్ధ్య కార్మికులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

## యాప్ బుకింగ్‌తోనే రైతుల ఇక్కట్లు

- యాదగిరిగుట్ట సింగిల్ విండో సెక్రటరీ ఆంజనేయులు



**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి02:**

యూరియాను అందించడంలో ఎలాంటి ఇబ్బందులు లేవని, కానీ యూరియా బుక్ చేయడంలో చిన్న ఫోన్ ఉన్న రైతులు ఇబ్బందులు పడుతున్నారని యాదగిరిగుట్ట సింగిల్ విండో సెక్రటరీ ఆంజనేయులు తెలిపారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. రైతులకు యూరియాను సకాలంలో అందిస్తున్నామని, రైతులు ఇబ్బందులు పడకుండా చూస్తున్నామని తెలిపారు. యాదగిరిగుట్ట సింగిల్ విండో కింద మొత్తం 13 గ్రామాలు ఉన్నాయని,మూడు గోదాముల్లో యూరియాను రైతులకు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. రైతులందరికీ యూరియా అందించి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు.

## గంజాయి విక్రయంపై పోలీస్ శాఖ ఈగిల్ బృందంతో కఠకస్మిక తనిఖీలు



**జయభేరి, పరవాడ:**

పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ బి. కృష్ణారావు ఆధ్వర్యంలో గంజాయి సేవిస్తున్న ప్రదేశాలు మరియు గంజాయి విక్రయం జరుగుతున్నట్లుగా అనుమానాస్పద ప్రదేశాలలో ఈగిల్ బృందాలతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా పాడుబడిన భవనాలు, జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాలు, నిర్మాణంలో ఉన్న ప్రదేశాలు తదితర ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అదేవిధంగా కొన్ని లాడ్జీలు మరియు ఇతర అనుమానాస్పద ప్రదేశాల్లో కూడా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. గంజాయి విక్రయించే మరియు గంజాయి సేవించే అనుమానాస్పద ప్రదేశాలు ఆధారంగా చేసుకుని ఈ తనిఖీలు చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా సి.ఐ. ఆర్. మల్లికార్జునరావు మాట్లాడుతూ పరవాడ ప్రాంతంలో గంజాయి వినియోగం లేదా విక్రయం ఎటువంటి పరిస్థితుల్లోనూ సహించబోమని ఇటువంటి అక్రమ కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి నిరోధించడంలో భాగంగా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు మరింత ముమ్మరం చేయబడతాయని తెలియజేశారు.

# మన్యంకొండలో వైభవంగా ధ్వజారోహణం

- నేడు విమాన రథోత్సవం

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లాలోని మన్యం కొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ దేవాలయమైన దిగువకొండ వద్దనున్న కొలువుదీరిన శ్రీ అలివేలు మంగతాయారు అమ్మవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ధ్వజారోహణం పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈనెల 1 నుండి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. కొండపై నున్న శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు జరిగిన నెల రోజుల తర్వాత దిగువకొండ వద్ద కొలువుదీరిన శ్రీ అలివేలు మంగతాయారు అమ్మ వారి బ్రహ్మోత్సవాలను ప్రతి ఏడాది అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా అమ్మవారి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఉత్సవాల 2వ రోజు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయరీతిలో నిర్వహించారు. అలాగే అమ్మవారి శేష వాహన సేవ, ఎదురుకోళ్లు, హనుమత్ వాహన సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని రకరకాల పూలు, వివిధ ఆభరణాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. దీంతో అమ్మవారు అలంకరణలో భక్తకోటికి దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశ పారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ, ఈవో శ్రీనివాసరాజు, పర్యవేక్షకుడు నిత్యానంద చారి, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య లతోపాటు దేవాలయం పురోహితులు, వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా దేవస్థానం వద్ద వివిధ రకాల తిను బండారాలు, ఆట వస్తువుల దుకాణాలు వెలిశాయి.





**నేడు గరుడ వాహన సేవ, విమానరథోత్సవం**

ఉత్సవాలలో భాగంగా గరుడ వాహన సేవ, విమాన రథోత్సవం, హనుమత్ వాహన సేవ కార్యక్రమాలను సాంప్రదాయ రీతిలో నిర్వహించనున్నారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ బలుపులతో శోభాయ మానంగా అలంకరించారు. విమాన రథోత్సవం సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన రథంపై అమ్మవారిని ఉంచి దేవస్థానం ముందున దేవగుండు వరకు ఊరేగింపుగా తీసుకెళ్తారు. పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, కాగడాల వెలుతురు, భక్తుల హరినామశ్చరణల మధ్య రథోత్సవం ముందుకు సాగుతుంది. వీరప్పోత్సవానికి జిల్లా నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

# మోదుగు పూలతో రంగుల తయారీ చేసుకోండి

- హోలీలో సహజ సిద్ధ రంగులను వాడండి వింజమూరి చంద్రమౌళి

జయభేరి, కొండమల్లేపల్లి :

ప్రతి హోలీ కి మోదుగు పూలు విరివిగా పూస్తాయని మోదుగు పూలతో హోలీ రంగులు తయారు చేసుకుని ఆడాలన్న నానుడి ఆనాడు నుండి కొనసాగుతుంది. హిందూ సంప్రదాయ ప్రకారం ప్రతి సంవత్సరం నిర్వహించే హోలీ పండుగలో సహజ సిద్ధ రంగులను వాడాలని గాయత్రి పరివార్ కొండమల్లేపల్లి నిర్వాహకులు వింజమూరు చంద్రమౌళి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ చందనం ఉపయోగించి హోలీని ఆడడం వలన మేలు జరుగుతుందని, ఎలాంటి నష్టం జరగదు అన్నారు. పాశ్చాత్య మోజులో పడి యువత కెమికల్స్ తో కూడిన రంగులను ఉపయోగించడం





వలన చర్మ సంబంధ వ్యాధులు ప్రబులుతాయని, కళ్ళల్లో పడితే కళ్ళు పోయే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. సహజ సిద్ధ రంగులైన చందనం, కుంకుమ, పసుపు తో పాటు ప్రతి హోలీకి ఆకులు కనబడకుండా పువ్వులే కనపడే మోదుగు పూలను హోలీకి ప్రత్యేకంగా ఉపయోగించాలని ఆయన సూచించారు. బీట్రూట్ తో కూడా రంగులు తయారు చేసుకోవచ్చన్నారు. ఏది ఏమైనా సహజ సిద్ధ రంగులు ఉపయోగించి హోలీ ఆడడం శ్రేయస్కరమని అన్నారు.

# బేటి బచావో.. బేటి పడావో...

జయభేరి, దేవరకొండ :

దేవరకొండ ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో దేవరకొండ గర్ల్స్ హై స్కూల్ నందు బేటి బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో సిడిపిఓ శ్రీమతి చంద్రకళ మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు వివరించడం జరిగింది, బాల్య వివాహాల వల్ల విద్య ఆగిపోతుంది ,ఆరోగ్య సమస్యలు వస్తాయి, భవిష్యత్తు నాశనం అవుతుంది, కాబట్టి ఎక్కడైనా బాల్యవివాహం జరిగే పరిస్థితి ఉంటే వెంటనే 1098 హెల్ప్ లైన్ నెంబర్ కి సమాచారం ఇవ్వాలి అని తెలియజేశారు, బాలిక విద్యా ప్రాముఖ్యత ,విద్య అనేది బాలిక ప్రాథమిక హక్కు బాలికను కాపాడితే సమాజం అభివృద్ధి చెందుతుందని బాలిక చదివితే దేశం ముందుకు సాగుతుందని తెలియజేశారు.

పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం అజ్గరి కథూన్ సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా బాల బాలికలపై పడుతుంది సోషల్ మీడియాను




ఎంతవరకు అవసరమో అంతవరకే ఉపయోగించుకోవాలి అని తెలియజేశారు, తెలియని వ్యక్తులతో చాట్ చేయకూడదు, వ్యక్తిగత సమాచారం ,ఫోటోలు పంపకూడదు అని వివరించడం జరిగింది. విజయలక్ష్మి సూపర్వైజర్ మాట్లాడుతూ సైబర్ బుల్లింగ్ డిజిటల్ వైలెన్స్ జరిగినట్లయితే 1930 , మహిళా హెల్ప్ లైన్ 181 నెంబర్ కి సమాచారం ఇవ్వాలి అని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాలికలకు చైల్డ్ మ్యారేజ్ వలన కలిగే నష్టాలపై వ్యాసరచన పోటీ నిర్వహించి వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులు ప్రధానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ డి చిట్టెమ్మ స్కూల్ టీచర్స్ అంగన్వాడి టీచర్స్ మణెమ్మ,సుశీల పాల్గొన్నారు.

# పెద్ద రాజమూరు పాఠశాలలో ముందస్తు హోలీ పండుగ వేడుకలు

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోనే దేవరకద్ర మండలం ఎంపీయుపిఎస్ పెద్దరాజమూరు పాఠశాలలో సోమవారం ముందస్తు హోలీ పండుగ వేడుకలను జరుపుకున్నట్లు పాఠశాల ఉపాధ్యాయుడు కే. శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ ఈ హోలీ పండుగ వేడుకలను ఆనందంగా, ఉత్సాహంగా, సంతోషంగా జరుపుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ కలిసి రంగులను ఒకరి మీద ఒకరు రంగులను పూస్తూ హోలీ జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులందరూ ఆటల, పాటలతో ఆనందంగా రంగుల పండుగ వేడుకలను ఆనందో స్వాహాల మధ్య జరుపుకున్నారు. హోలీ పండుగ ప్రాముఖ్యతను , విలువలను గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు.ఈ పండుగను ప్రేమ ,ఐక్యత మరియు సంతోషాల సంకేతంగా జరుపుకుంటారని, ఈ పండుగ రెండు రోజుల పండుగ మొదటి రోజు రాత్రి సమయంలో కామ




దహనం , రెండో రోజు రంగుల హోలీ జరుపుకుంటారన్నారు. ఈ పండుగను మనలో చిన్న, పెద్ద, కుల,మత బేధాలు లేకుండా అందరూ జరుపుకునే రంగుల పండుగ అని వారన్నారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కే. శంకర్, కే.వెంకటేశ్వర్లు, అంగన్వాడీ టీచర్లు అంజమ్మ , సంతోషమ్మ, స్వప్న మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# పెన్షనర్స్ భవన నిర్మాణ నిధికి విరాళం

జయభేరి, దేవరకొండ :

దేవరకొండ పెన్షనర్స్ సేవాసదనం నందు అలంపల్లి శ్రీనివాసులు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు తన 63వ పుట్టినరోజు వేడుక నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారిని ప్రధాన కార్యదర్శి అంకం చంద్రమౌళి, ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఐజాక్ శాలువ కప్పి కిరీటం దరింపజేసి స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేసినారు. శ్రీనివాసులు మాట్లాడుతూ నా పుట్టినరోజు ఇంత ఘనంగా నిర్వహించడం సంతోషాన్ని కలిగించింది అన్నారు. ఆ ఆనందంతో వారు గతంలో రూ. 10,116 విరాళం అందజేసినారు. తిరిగి ఈ రోజు రూ 3,000 అందజేసినారు. మొత్తం 13, 116 అందజేసినారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంచర్ల నారాయణ రెడ్డి, సంయుక్త కార్యదర్శి వనం బుచ్చయ్య, సల్వాది పెద్దులు, కర్ణాటి పండరినాథ్, మోటమర్రి పురుషోత్తం, నందులాల్, తదితరులు పాలుగొన్నారు అందరికి స్వీట్స్, తేనీరు అందజేయడం జరిగినది.

# పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ చేసిన ఎస్ఎఫ్ఐ

జయభేరి, పరకాల, మార్చి 02:

సోమవారం ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్ ఆధ్వర్యంలో రౌత్ మనోహర్ జ్ఞాపకార్థంతో పరకాల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లోని పదవ తరగతి చదువుతున్న విద్యార్థుకు పరకాల ఎమ్మార్వో విజయలక్ష్మి చేతుల మీదుగా 40 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, కంపాస్ లు అందించారు. అనంతరం ఎమ్మార్వో విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు బాగా రాసి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అలాగే పరీక్షలు రాసే ముందు విద్యార్థులు భయనీకి గురికాకుండా ధ్యారవంతంగా స్పష్టంగా రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్ ఐ దామోదర్ బాలికల ఉన్నత పాఠశాల ఇంచార్జ్ పద్మజ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్, మండల అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్, జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ, హేమంత్, జిల్లా కమిటీ సభ్యుడు సాల్మన్ రాజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# టీటీడీ ఛైర్మన్ పై మహిళ తీవ్ర ఆరోపణ

జయభేరి, హైదరాబాద్ :

తీవ్రమైన సామాజిక, రాజకీయ వివాదం వెలుగులోకి వచ్చింది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుపై మహిళ ఒక ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదిలో ఆమె ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్ కు లేఖ రాసి తన సమస్యలను తెలియజేసింది. ఫిర్యాదులో, బాధితురాలు బీఆర్ నాయుడు గత 30 ఏళ్లుగా ఆమెతో వ్యక్తిగత సంబంధం కొనసాగించి, ఆర్థికంగా, మానసికంగా వేధిస్తున్నాడని పేర్కొంది. అదేవిధంగా, అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమార్తె బాధ్యతను ఆమె తీసుకున్న పరిస్థితుల్లో, బీఆర్ నాయుడు టీటీడీ ఛైర్మన్ పదవిలో ఉన్నందుకు కఠిన ఆగ్రహం వ్యక్తం చేసింది. బీఆర్ నాయుడు లాంటి ఉమెనైజర్కు టీటీడీ ఛైర్మన్ పదవి ఇవ్వడంపై మీకే నష్టం ఆలోచించుకోండి అంటూ లేఖ రాసింది.



# హిందూజా బొగ్గు లారీలను నిలుపుదల చేయాలి


- కలెక్టర్ కిఫిర్యాదు చేసిన సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గని శెట్టి

జయభేరి, పరవాడ:

పరవాడ మండలపరవాడ సినిమా హాల్ జంక్షన్ హిందూజా బొగ్గు లారీలను ఈ మార్గం మీదగా నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టర్ కి సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గని శెట్టి సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. హిందూజా బొగ్గు లారీలను ఈ మార్గం మీదగా ప్రయాణించడం వలన తీవ్రమైన బొగ్గు ఈ రోడ్లపై పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, లారీలు నిండు ధూళి రోడ్లపై పడిప్రజలు ఈ మార్గంలో ప్రయాణించడమే నరకంగా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు.పరవాడ ఎమ్మార్వో ఆఫీస్ జంక్షన్, సినిమా హాల్ జంక్షన్, సబ్ స్టేషన్, ఊట గడ్డ, లంకెలపాలెం గ్రామం పూర్తిగా ధూళితో మూసి వేయబడింది. ఈ గ్రామాల్లో ప్రజలు ఉండలేని పరిస్థితి ఏర్పడుతుంది . అధిక లోడుతో ప్రయాణిస్తున్న లారీలపై ఆర్టీవో అధికారులు దాడులు చేసికేసులు నమోదు చేయాలని కోరారు. ఈ మార్గంలో అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, రోడ్లు పూర్తిగా పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి . హిందూజా కి రైల్వే ద్వారా బొగ్గు తరలించుకోవాలని కోరారు. హిందూజా కంపెనీ బొగ్గు లారీలకు బదులుగా రైల్వే మార్గం ద్వారా బొగ్గు తరలించుకోవాలి తప్ప ఈ మార్గంలో ప్రయాణించడం వలన ప్రజల తీవ్ర అనారోగ్యాలుకి, జబ్బులకు గురవుతున్నారని తెలియజేశారు. ఈ మార్గం నుండి బొగ్గు లారీలు నిలుపుదల చేయాలని కోరుతున్నాం. ప్రభుత్వం హిందూజా కంపెనీకి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలి. ఆర్టీవో అధికారి కి వెంటనే చర్యలు చేపట్టమని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. దీంతో గని శెట్టి మరో పత్రం ఆర్టీవో అధికారులకు కూడా అందజేశారు.

# వివాహాలు చేయడం పూర్వజన్మ సుకృతం

- అవోపా వివాహ పరిచయ వేదికకు అపూర్వస్పందన
- ఆవోప జిల్లా అధ్యక్షుడు పాపిశెట్టి మురళీకృష్ణ



జయభేరి, దేవరకద్ర :

జంటలను కలిపి వివాహం చేయడం పూర్వజన్మ సుకృతమని అవోపా జిల్లా అధ్యక్షులు పాపుశెట్టి మురళీకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు మలిపెద్ది శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవి గార్డెన్లో అవోపా జిల్లా అధ్యక్షులు పాపిశెట్టి మురళీకృష్ణ ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివాహ పరిచయ వేదిక కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని అందులో భాగంగా వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. పరిచయ వేదిక కార్యక్రమానికి మొత్తం 500 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా వారిలో 200 మంది వరకు అబ్బాయిలు వందమంది వరకు అమ్మాయిలు రావడం జరిగిందన్నారు. వివాహ పరిచయ వేదిక కార్యక్రమానికి జిల్లాలో అపూర్వ స్పందన లభించిందని అన్నారు. అనంతరం రిటైర్డ్ ఉద్యోగులకు ఉత్తమ ఉద్యోగులకు అవోపా ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని చేపట్టారు. వివాహ పరిచయ వేదిక కార్యక్రమంలో విద్యార్థులు చేసిన నృత్యాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గుండా వెంకటేష్, మిర్యాల వేణుగోపాల్ గుప్తా, భాస్కర్, నర్సింలు, ప్రమోద్, సూర్యనారాయణ, సత్యవతి, వినోద్, మురళీకృష్ణ, శ్రీకాంత్, దోమ శ్రీను, కోదండరాం, కన్నయ్య, హరికాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కళాశాల విద్యార్థులలో వ్యవస్థాపక దృక్పథంపై అవగాహన కార్యక్రమం



జయభేరి, దేవరకొండ :

వ్యవస్థాపక అభివృద్ధి సెల్ తెలంగాణ నైపుణ్య, జ్ఞాన కేంద్రం (EDC & TSKC) సహకారంతో కళాశాల విద్యార్థులలో వ్యవస్థాపక దృక్పథంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. కళాశాల ప్రాజెక్ట్ పనిలో భాగంగా కళాశాల విచ్చేసిన TTWR DC(W) లెక్చరర్, శ్రీమతి దివ్య విద్యార్థినులకు సహకరిస్తూ విద్యార్థులు చదువు పూర్తయ్యాక ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకే పరిమితం కాకుండా వేరే వాటిపై ఆధారపడకుండా వినూత్నమైన ఆలోచనలతో వ్యవస్థాపక దృక్పథం కలిగి, అనిల్ అంబానీ ముఖేష్ అంబానీ లాంటి గొప్ప స్థాయికి విద్యార్థులు చేరుకోవాలని , విద్యార్థులకు ప్రిన్సిపల్ డాక్టర్. రామావత్ రవి తెలియ పరచారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి కోటయ్య టి ఎస్ కే సి ,ప్లాస్మెమెంట్ కోఆర్డినేటర్ లింగమయ్య, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో 'ఎంపొహెర్ 2026' సదస్సు

మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, వారిని ఆర్థికంగా మరియు సాంకేతికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా 'ఎంపొహెర్' సంస్థ సదస్సును నిర్వహిస్తోందని నిర్వాహకులు సోమవారం ఆవిష్కరించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఎందుకు సంబంధించిన కరపత్రాన్ని ఎంపొహెర్ ప్రతినిధులు సౌమిని, పనిశ్రీ, స్వర్ణ, మేఘన ఆవిష్కరించారు. సదస్సును రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై సదస్సును ప్రారంభిస్తారని తెలిపారు.

# సేవా కార్యక్రమాల్లోనూ ప్రెస్ క్లబ్ లు ముందుండాలి

- టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ
- కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ని అభినంధించిన విరాహత్

**జయభేరి, కాప్రా :**

ప్రెస్ క్లబ్ లు జర్నలిస్ట్ ల సంక్షేమంతో పాటు సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టడం లోనూ ముందుండాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీసూచించారు. నూతనంగా ఎన్నికైన కాప్రా ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా కమిటీ ప్రతినిధు లు సోమవారం అధ్యక్షుడు విరాహత్అలీ, కోశాధి కారి మోతె వెంకట్ రెడ్డిలను మార్యాద పూర్వకంగా కలిశారు.

ఈ సందర్బంగా కాప్రా ప్రెస్ క్లబ్ కొత్త అధ్యక్షుడు జ్యోతిర్మయిచారి, ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శ్రీనివాస్, కోశాధికారి సురేష్ లను విరాహత్ అలీ శాలువాతో సన్మానించారు. కొందరి చేష్టల వల్ల సమాజంలో పాత్రికేయ విలువలు రోజు రోజుకి దిగజారి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రెస్ క్లబ్ లు బాధ్యతాయు తంగా ఉంటూ పాత్రికేయ విలువలు కాపాడ టంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. అలాగే పాత్రికేయుల సంక్షేమం తో పాటు సమాజ



సేవలో కూడా ముందుండాలని కోరారు. ఇందుకు సంబందించిన సేవా కార్యక్రమాలు చేపట్టి మంచి పేరు తెచ్చుకోవాలని కాప్రా ప్రెస్ క్లబ్ కొత్త కమిటీ కి సూచించారు. ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్ క్లబ్ కమిటీ ప్రతినిధులు, సీనియర్ జర్నలిస్ట్ లు చంద్ర మౌళి, సహదేవ చారి, ఆంధ్రప్రభ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, చంద్ర మోహన్ కడియాల రమేష్, శ్రీని వాస్, శంకర్, బాల్ రెడ్డి, నర్సింగ్ గౌడ్, పవన్, బాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.



# మీ జుట్టు వేగంగా.. బలంగా పెరగాలంటే...

**శరీరానికి పూర్తి ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు, ముఖ్యమైన అమైనో ఆమ్లాలు లభిస్తే, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. వాటి పెరుగుదల కూడా బాగుంటుంది. ఒక నివేదిక ప్రకారం, జుట్టు బలం, మెరుపు, వేగంగా పెరగడానికి సమతుల్య ఆహారం అవసరం. అందువల్ల, మీరు జుట్టు వేగంగా పెరగాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకోవడం ముఖ్యం. ఈ ఆహారాలు తప్పక తినాలని నిపుణులు చెబుతున్నారు.**

**జుట్టు పెరుగుదలకు సూపర్ ఫుడ్స్:** జుట్టు వేగంగా పెరగడానికి పోషకాహారం ప్రత్యేక ప్రాముఖ్యత కలిగి ఉంది. సరైన ఆహారం లేకపోవడం, ఒత్తిడి, మారుతున్న జీవనశైలి కారణంగా జుట్టు రాలడం సమస్య వేగంగా పెరుగుతోంది. పరిశోధన ప్రకారం, మన జుట్టులో 90శాతం ప్రోటీన్ అంటే కెరాటిన్‌తో తయారవుతుంది. శరీరానికి పూర్తి ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు, ముఖ్యమైన అమైనో ఆమ్లాలు లభిస్తే, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. వాటి పెరుగుదల కూడా బాగుంటుంది. ఒక నివేదిక ప్రకారం, జుట్టు బలం, మెరుపు, వేగంగా పెరగడానికి సమతుల్య ఆహారం అవసరం. అందువల్ల, మీరు జుట్టు వేగంగా పెరగాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకోవడం ముఖ్యం. ఈ ఆహారాలు తప్పక తినాలని నిపుణులు చెబుతున్నారు.

1. **గుడ్డు** – గుడ్లలో ప్రోటీన్, బయోటిన్, జింక్ పుష్కలంగా ఉంటాయి. జుట్టు నిర్మాణానికి ప్రోటీన్ అవసరం. అంటే కెరాటిన్. బయోటిన్ జుట్టును బలపరుస్తుంది. దాని కొత్త పెరుగుదలను వేగవంతం చేస్తుంది. జింక్ నెత్తిమీద చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.
2. **పాలకూర** – పాలకూరలో ఫోలేట్‌తో పాటు ఇనుము, విటమిన్ ఎ, సి ఉంటాయి. శరీరానికి ఆక్సిజన్ సరఫరా చేయడం ద్వారా ఇనుము జుట్టు మూలాలను బలపరుస్తుంది. విటమిన్ ఎ, సి తలపై సహజ నూనె అంటే సెబమ్ ఏర్పడటానికి సహాయపడతాయి. ఇది జుట్టు పొడిబారడాన్ని తగ్గిస్తుంది.
3. **బెర్రీలు** – స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్బెర్రీస్ వంటి బెర్రీలలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టు కణాలను ఫ్రీరాడికల్ నష్టం నుండి రక్షిస్తాయి. జుట్టు విచ్ఛిన్నతను నిరోధించే కొల్లాజెన్‌ను నిర్మించడంలో సహాయపడతాయి.
4. **చేపలు** – సాల్మన్, సార్డిన్ వంటి చేపలలో ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ డి, ప్రోటీన్లు లభిస్తాయి.. ఇవి జుట్టు మూలాలను బలోపేతం చేస్తాయి. కొత్త జుట్టు పెరుగుదలను వేగవంతం చేస్తాయి. ఒమేగా3 జుట్టు పొడిగా మారడానికి అనుమతించదు.
5. **వాల్‌నట్స్** – వాల్‌నట్స్ ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ ఇ, బయోటిన్‌లకు చాలా మంచి మూలం. అవి జుట్టు కణాలలో వాపును తగ్గిస్తాయి. బలాన్ని పెంచుతాయి. బయోటిన్ జుట్టు రాలడాన్ని నివారిస్తుంది.
6. **క్యారెట్లు** – క్యారెట్లలో బీటాకెరోటిన్, విటమిన్ ఎ ఉంటాయి. ఇవి తల చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. జుట్టుకు సహజమైన మెరుపును తెస్తాయి. విటమిన్ ఎ జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. జుట్టు విరిగిపోకుండా, రాలకుండా నిరోధిస్తుంది.
7. **విత్తనాలు** – గుమ్మడికాయ, అవిసె, చియా వంటి విత్తనాలలో జింక్, ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్ బి పుష్కలంగా ఉంటాయి. అవి జుట్టు ఆకృతిని మెరుగుపరుస్తాయి. కొత్త పెరుగుదలను వేగవంతం చేస్తాయి.
8. **బీన్స్** – బీన్స్ వంటి ఆహారాలు అంటే కిడ్నీ బీన్స్, చిక్‌పీస్, బ్లాక్ ఐడ్ బఠానీలు ప్రోటీన్, ఐరన్, బయోటిన్‌తో సమృద్ధిగా ఉంటాయి. ఇవి శాఖాహారులకు జుట్టుకు ఉత్తమమైన ఆహారాలు.
9. **చిలగడదుంప** – చిలగడదుంపలో బీటాకెరోటిన్ ఉంటుంది. ఇది శరీరంలో విటమిన్ ఎగా మారి జుట్టు పెరుగుదలను వేగవంతం చేస్తుంది. ఇది తల చర్మం సహజ తేమను కూడా నిర్వహిస్తుంది.

*(NOTE: ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణులు అందించిన సమాచారం ప్రకారం ఇక్కడ తెలియజేయడమైనది. ఆరోగ్యరీత్యా ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది)*





# తెలంగాణ భవన్ లో 24 X 7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**జయభేరి, న్యూఢిల్లీ :**

పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ పౌరుల కోసం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్లో 24×7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. న్యూ ఢిల్లీలోని తెలంగాణ భవన్ సీనియర్ అధికారులు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత భారత రాయబార కార్యాలయాలతో ఇప్పటికే నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితులను అంచనా వేస్తున్నారు. ఆయా దేశాల్లో నివసిస్తున్న, చిక్కుకున్న తెలంగాణ పౌరులు, వారి కుటుంబ సభ్యుల నుంచి వస్తున్న సమాచారాన్ని దృష్టిలో ఉంచుకుని, తెలంగాణ ప్రభుత్వం న్యూ ఢిల్లీలోని తెలంగాణ భవన్లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్ను ఏర్పాటు చేసింది. అవసరమైన సమన్వయం, సహాయం అందించేందుకు ఈ కంట్రోల్ రూమ్ పనిచేస్తుంది.

ప్రస్తుతం ఇరాన్, గల్ఫ్ తదితర ప్రాంతాల్లో ఉన్న తెలంగాణ పౌరులు, తెలంగాణలో ఉన్న వారి కుటుంబ సభ్యులు ఎలాంటి ఇబ్బందులు, ప్రయాణ అంతరాయాలు, అత్యవసర పరిస్థితులు ఎదురైతే ఈ కంట్రోల్ రూమ్ను సంప్రదించవచ్చు.

24×7 కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు : (న్యూ ఢిల్లీలోని తెలంగాణ భవన్ నుంచి పనిచేస్తుంది)

వందన బరువా : +91 9871999044, సీహెచ్. చక్రవర్తి : +91 9958322143, జావేద్ హుస్సేన్ : 9910014749, రక్షిత్ నాయక్ : +91 9643723157. మధ్యప్రాచ్య ప్రాంత పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

# శ్రీపాదరావుకు శాసనసభలో నివాళులు

**జయభేరి, హైదరాబాద్:**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసన సభాపతి, స్వర్గీయ దుద్దిళ్ళ శ్రీపాద రావు 89 వ జయంతి సందర్భంగా శాసనసభ భవనం లోని లాంజ్ లో ఏర్పాటు చేసిన చిత్రపటానికి తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, అసెంబ్లీ విప్ ఆది శ్రీనివాస్, శాసనమండలి సభ్యులు, కౌన్సిల్ సెక్రటరీ డా. వి. నరసింహా చార్యులు, అసెంబ్లీ సెక్రటరి రేండ్ల తిరుపతి, పి . శ్రీకాంత్, సి ఎల్ పి కార్యాలయ కార్యదర్శి మరియు ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# పసుపు రంగు రాసిన చికెన్ విక్రయిస్తే చర్యలు

**జయభేరి, హన్మకొండ :**

చికెన్ సెంటర్లలో కోడి మాంసాన్ని శుభ్రం చేసేటప్పుడు పసుపుకు బదులుగా కృత్రిమ రంగులు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హనుమకొండ ఫుడ్ ఇన్స్పెక్టర్ బ్రహ్మాజీ హెచ్చరించారు. ఆదివారం వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్య దర్శి చక్రపాణితో కలిసి ఆయన పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసాయన రంగులు కలిపిన మాంసం తింటే ఉదర, పేగు క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

# ప్రేమతీరం ట్రయాంగిల్ లవ్ స్టోరీ ఫస్ట్ లుక్ విడుదల

**జయభేరి, హైదరాబాద్ :**

రాబోయే ట్రియాంగిల్ లవ్ స్టోరీ ప్రేమతీరం యొక్క ఫస్ట్ లుక్ పోస్టర్ ఆదివారం, హలవాలో లా చాంబార్ అధికారికంగా విడుదలైంది. ఈ చిత్రంలో నటినటులు రిషి సాగర్ అల్లూరి, శృతి శంకర్, మరియు యాష్, స్వాతి సియారా, ప్రధాన పాత్ర ల్లో నటించారు మరియు దేవా క్రియేషన్ బ్యానర్‌పై నిర్మించారు, చంటి నాయక్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించగా, హెచ్. శిరీష దేవా నిర్మాతగా కెమెరామెన్ మధు ఎల్లుట్ల వ్యవహరిస్తున్నారు. మైనంపల్లి





హనుమంత్ రావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ చిత్రం సంగీతం, ప్రేమ కథనం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రధాన నటుడు, యష్ మాట్లాడుతూ, ఈ చిత్రం ప్రేమ, కథనం యాక్షన్, బలమైన సందేశాన్ని మిళితం చేసిందని, నటీమణులు యష్, స్వాతి సియారా ఈ అవకాశం ఇచ్చినందుకు బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ చిత్రం ప్రేక్షకుల ప్రశంసలను పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సంగీత దర్శకుడు ssv. వెంకటేష్, పాటలు బాగా రూపుదిద్దుకున్నాయని, ఇది ఒక ప్రధాన హైలైట్ అవుతుందని అన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమం

**జయభేరి, వికారాబాద్ :**

వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి హిల్స్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షుల కోసం నిర్వహించిన శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ తన కుటుంబ సభ్యులతో కలిసి రాహుల్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యక్రమాలు మరియు రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై స్వల్పంగా చర్చించినట్లు తెలిపారు. శిక్షణా




శిబిరం ద్వారా పార్టీ నాయకులకు సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలపై పోరాట విధానాలు, ఎన్నికల వ్యూహాలపై ప్రత్యేక అవగాహన కల్పించినట్లు నాయకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల డిసిసి అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయాలి

- ఉప్పల్ నియోజికవర్గ శాసనసభ్యులు బండారి లక్ష్మా రెడ్డి, మల్లాపూర్ మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి

**జయభేరి, మల్లాపూర్ :**

మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల లో యువ నాయకులు సూర్య వర్ధన్ ఆధ్వర్యంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు పరీక్షా ప్యాడ్స్ పంపిణీ. మల్లాపూర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 10 వ తరగతి పరీక్షలకు చదువుతున్న పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మా రెడ్డి , మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి సమక్షంలో ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల చదువుకు అండగా నిలవాలనే ఉద్దేశంతో పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.పదవ తరగతి



విద్యార్థులు ఒత్తిడిని జయిస్తూ విజయం సాధించాలని, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రవణ్, మెండ రఘువరన్, జావీద్, సౌమ్యరంజన్, రేవంత్, బాచి రామ్ గోపాల్, భూక్యా కిట్టు నాయక్, ఎడార్ల గణేష్, స్థానిక నాయకులు దయాకర్ రెడ్డి, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.



# పండ్లను కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలి..?

**పండ్లు మన ఆరోగ్యానికి ఎంత మంచివో మనందరికీ తెలుసు. డాక్టర్లు సైతం ఆహారంలో పండ్లను చేర్చుకోవాలని చెబుతారు. కానీ చాలా మంది పండ్లను కోసి కొన్ని గంటల తర్వాత తింటారు. అయితే కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. లేకపోతే అది మన శరీరం పై చెడు ప్రభావాన్ని చూపుతుంది.**

పండ్లు మన శరీరానికి మంచివని అందరికీ తెలుసు. ప్రతిరోజ పండ్లను తినడం ఆరోగ్యానికి మంచిది. విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ వంటివి పండ్లలో సమృద్ధిగా ఉంటాయి. పండ్లు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో పండ్లను చేర్చుకోవాలని వైద్యులు సూచిస్తారు. కొన్నిసార్లు మనం పండ్లను కోసి అలాగే ఉంచుతాం. ఆఫీసులు, ఏదైన ప్రయాణ సమయాల్లో కోసి తీసుకెళ్తుంటారు. కొంతమంది కోసి ఫ్రిజ్‌లో పెడతారు. కొన్ని గంటల తర్వాత వాటిని తింటారు. కానీ కోసిన పండ్లను ఎంతసేపట్లో తినాలి..? అవి ఎంతకాలం మంచిగా ఉంటాయి అనేది చాలా మందికి తెలియదు.

### పండ్లు తినడానికి సరైన సమయం ఏమిటి?

పండ్లను ఏ సమయంలో తిన్న మంచిదేనని నిపుణులు అంటున్నారు. అయితే కొన్నింటిని ఉదయం ఖాళీ కడుపుతో, మరికొన్నింటిని రాత్రి వేళలో తినకూడదని చెబుతారు. ఏదైనా సరే మితంగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని అంటున్నారు.

### కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలి..?

కోసిన వెంటనే పండ్లు చెడిపోవు. కానీ వాటిని ఎంత త్వరగా తింటే అంత మంచిది. నిజానికి కోసిన పండ్లలో ఇన్ఫెక్షన్ ప్రమాదం పెరుగుతుంది. వేసవి, వర్షాకాలం సూక్ష్మజీవుల పెరుగుదలకు ఉత్తమ సమయాలు. ఈ సీజన్లలో కోసిన పండ్ల వల్ల ఇన్ఫెక్షన్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఎక్కువసేపు నిల్వ చేయకుండా వీలైనంత త్వరగా వాటిని తినాలి.



# ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల కిడ్నీలు శుభ్రం, ఆరోగ్యం

మన శరీరంలో ఎప్పటికప్పుడు ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను కిడ్నీలు మూత్రం ద్వారా బయటకు పంపిస్తాయి. దీంతో శరీరంలో వ్యర్థాలు పేరుకుపోకుండా ఉంటాయి. ఆరోగ్యంగా ఉంటాము. అయితే మనం పాటించే ఆహారపు అలవాట్లు, జీవనశైలి, దీర్ఘకాలిక వ్యాధులు, వాడే మందులు వంటి కారణాల వల్ల మన కిడ్నీల పనితీరు మందగిస్తుంది. దీంతో వ్యర్థాలను కిడ్నీలు సరిగ్గా బయటకు పంపలేకపోతాయి. దీని వల్ల దీర్ఘకాలంలో శరీరంలో వ్యర్థాలు పేరుకుపోతాయి. ఇవి అనేక వ్యాధులను కలగజేస్తాయి. అందువల్ల కిడ్నీలను మనం ఆరోగ్యంగా ఉంచుకోవాలి. కిడ్నీలు ఎప్పటికప్పుడు వ్యర్థాలను బయటకు పంపిస్తూ శుభ్రంగా ఉండాలి. అప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటాం. అయితే పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కిడ్నీలను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. దీని వల్ల ఇతర వ్యాధులు రాకుండా కూడా అడ్డుకోవచ్చు.

### కొబ్బరినీళ్లు, యాపిల్ సైడర్ వెనిగర్..

కొబ్బరినీళ్లను రోజూ తాగడం వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. దీని వల్ల శిరోజాలు, చర్మం సురక్షితంగా, ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కిడ్నీ సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు. కిడ్నీలు శుభ్రంగా మారుతాయి. కొబ్బరినీళ్లలో ఉండే ఎలక్ట్రోలైట్స్ కిడ్నీలను సురక్షితంగా ఉంచుతాయి. అలాగే కిడ్నీల ఆరోగ్యానికి యాపిల్ సైడర్ వెనిగర్ కూడా పనిచేస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో ఒక టీస్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్ కలిపి తాగుతుంటే కిడ్నీలు క్లీన్ అయి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే బరువు తగ్గేందుకు కూడా ఇది ఎంతగానో పనిచేస్తుంది. షుగర్, కొలెస్ట్రాల్ స్థాయిలను సైతం అదుపులో ఉంచుతుంది. ఇక కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచేందుకు గాను పలు పండ్లు కూడా సహాయం చేస్తాయి. స్ట్రాబెర్రీలు, చెర్రీలు, యాపిల్స్, క్రాన్ బెర్రీలు, ద్రాక్ష, పైనాపిల్ వంటి పండ్లను తింటుంటే మేలు జరుగుతుంది.

### ఈ ఆహారాలు కూడా అవసరమే..

అరటి పండ్లు, నారింజ పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది శరీరంలోని సోడియం స్థాయిలను తగ్గిస్తుంది. దీని వల్ల కిడ్నీలు శుభ్రంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కాలిఫ్లవర్, క్యాబేజీ, ఎరుపు రంగు క్యాప్సికం, ముల్లంగి వంటి కూరగాయలను తింటున్నా కూడా కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. కోడిగుడ్డు తెల్ల సొన, స్కిన్ లెస్ చికెన్, చేపలు, ఆలివ్ ఆయిల్, వెల్లుల్లి, ఉల్లిపాయలు వంటి ఆహారాలను కూడా తీసుకోవచ్చు. అయితే కిడ్నీలు ఎల్లప్పుడూ శుభ్రంగా, ఆరోగ్యంగా ఉండేందుకు గాను ఆహారంలో ఉప్పు తీసుకోవడం తగ్గించాలి. సోడియం తక్కువగా ఉండే ఆహారాలను తినాలి. మద్యం సేవించడం, పొగ తాగడం మానేయాలి. ఆకుకూరలు, కూరగాయలను, పండ్లను తినేందుకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలి. అలాగే రోజూ నీళ్లను తగిన మోతాదులో తాగాలి. ఇలా ఆహారపు అలవాట్లను పాటిస్తుంటే కిడ్నీలు శుభ్రంగా ఆరోగ్యంగా ఉంటాయి.

### బీట్ రూట్, నిమ్మరసం..

మనం బీట్‌రూట్‌ను అప్పుడప్పుడు తింటుంటాం. కానీ బీట్‌రూట్‌ను రోజువారి ఆహారంలో కచ్చితంగా భాగం చేసుకోవాలి. బీట్ రూట్‌లో పొటాషియం, నైట్రేట్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కిడ్నీలను శుభ్రం చేసి ఆరోగ్యంగా ఉంచుతాయి. రోజూ ఒక కప్పు బీట్ రూట్ ముక్కలను తింటుండాలి. లేదా ఒక కప్పు బీట్ రూట్ జ్యూస్‌ను అయినా తాగవచ్చు. దీని వల్ల కిడ్నీల ఆరోగ్యం మెరుగు పడుతుంది. కిడ్నీ వ్యాధులు రాకుండా ఉంటాయి. అలాగే కిడ్నీల ఆరోగ్యానికి నిమ్మరసం కూడా ఎంతగానో పనిచేస్తుంది. నిమ్మరసంలో విటమిన్ సి ఉంటుంది. ఇది కిడ్నీలను శుభ్రం చేస్తుంది. కిడ్నీ స్టోన్లు ఏర్పడకుండా రక్షిస్తుంది. కిడ్నీల పనితీరు మెరుగు పడేలా చేస్తుంది. అదే విధంగా అల్లం రసం కూడా ఎంతగానో మేలు చేస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే అల్లం రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో తాగుతుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.



# పొద్దునే ప్రొటీన్ ఫుడ్

పొద్దున నిద్ర లేచిన వేళా విశేషమే రోజంతటినీ నిర్ణయిస్తుంది. పొద్దునే మన టిఫిన్లలో ఇడ్లీ, పోహా, ఉప్మా, ఆలూ పరాఠా లాంటివి ప్రధానంగా ఉంటాయి. ఇవన్నీ కార్బొహైడ్రేట్లతో నిండి ఉంటాయి. కానీ ఆరోగ్యానికి అత్యవసర పోషకమైన ప్రొటీన్ ఉండదు. అయితే, ఉపాహారం నుంచే 20 గ్రాముల ప్రొటీన్ అందేలా చూసుకుంటే మంచిది. అలాగని ప్రొటీన్ పౌడర్ల మీద ఆధారపడకూడదు. ఆహారంలో కొన్ని చిన్న మార్పులు చేసుకుంటే సరిపోతుంది. పొద్దునే ఆరగించడానికి ప్రొటీన్లతో సమృద్ధమైన టిఫిన్లు కొన్నిటి గురించి తెలుసుకుందాం. శరీర విధులు సాఫీగా సాగాలంటే ప్రొటీన్లు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. శరీర కణజాలం, కండరాలు, ఎముకలు, చర్మం, వెంట్రుకలు, గోళ్ల నిర్మాణంలో ప్రొటీన్లు కీలకంగా నిలుస్తాయి. ఎంజైముల విడుదలలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. అంతేకాదు ప్రొటీన్లు మన రోగ నిరోధక వ్యవస్థలో అంతర్భాగం. ప్రొటీన్లు తీసుకుంటూ తగినంత వ్యాయామం చేస్తే ఆరోగ్యకరమైన జీవితం సొంతమవుతుంది. ప్రొటీన్లు శరీరానికి మాత్రమే కాదు మెదడు పనితీరుకు కూడా అండగా నిలుస్తాయి.

### పల్లీలు కూరగాయలతో క్వినోవా ఉప్మా

ఓ కప్పు క్వినోవాలో 8 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. దీనికి కూరగాయలు, కరివేపాకు, ఓ టేబుల్ స్పూన్ వేయించిన పల్లీలు, పచ్చి బఠాణీలు కలపాలి. ఉడికించిన శనగలతో సలాడ్ తీసుకుంటే మొత్తం 22 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి. ఒక్క క్వినోవా ఉప్మా, కూరగాయలు, పల్లీల నుంచే 17 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### శనగపిండి టోస్ట్, టోఫు బుర్జి

రెండు బ్రెడ్ పకోడీలు (శనగపిండితో చేసినవి) తీసుకోవాలి. దీనికి 75 గ్రాముల టోఫు బుర్జీ జతచేయాలి. టమాటాలు, పసుపు, జీలకర్ర కలపాలి. దీని ద్వారా 23 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### రాజ్మా పరాఠా, కప్పు పెరుగు

మామూలుగా రాజ్మా లంచ్‌కే అనుకుంటారు. కానీ ఓ కప్పు రాజ్మాను ఉడికించి ముద్దగా చేసుకోవాలి. దాన్ని పరాఠా స్టఫ్‌గా వాడుకోవాలి. ఇలా చేస్తే 15 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని పుదీనా, సైంధవ లవణం కలిపిన హంగ్ కర్డ్ (నీళ్లు తీసేసిన పెరుగు)లో అద్దుకుని తినేయాలి.

### సత్తు పరాఠా, ఉడికించిన గుడ్డు, బటర్ మిల్క్


సత్తు అంటే వేసవి పానీయం మాత్రమే కాదు. 100 గ్రాముల సత్తులో 20 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. కాబట్టి, కొద్దిగా నెయ్యి వేసి సత్తు పరాఠా చేసుకోవాలి. తినే వాళ్లయితే దీంతోపాటు ఓ ఉడికించిన గుడ్డు తినాలి. గ్లాసెడు బటర్ మిల్క్ తాగాలి. రెండు మోస్తరు సత్తు పరాఠాల నుంచి 14 గ్రాములు, ఉడికించిన గుడ్డు నుంచి 6 గ్రాములు, బటర్‌మిల్క్ నుంచి 2 గ్రాములు.. మొత్తంగా 22 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### మూంగ్‌దాల్ చిల్లా పనీర్ ఫిల్లింగ్

ఒక్కో చిల్లా (దోశ లాంటిది)లో 5 6 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. వీటిలో నింపే 50 గ్రాముల తురిమిన పనీర్ నుంచి 9 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి. రెండు చిల్లాలను ఓ కప్పు పెరుగుతో లాగించేయాలి. పెరుగుతో లభించే 5 గ్రాములతో కలుపుకొని మొత్తం 26 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### మొలక పెసర్లు ఓట్స్ చీలా

ఇది కూడా దోశలా చేసుకునేదే. అరకప్పు ఓట్స్‌లో 5 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని ఓ కప్పు పెసర మొలకలతో కలిపితే మరో 14 గ్రాములు లభిస్తాయి. దీనికి కాస్త శనగపిండిని జోడిస్తే మరో 2 గ్రాములు మొత్తంగా 21 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి.





## వంటల్లో స్పెషలిస్ట్‌ని!

షూటింగ్ ఉంటే లొకేషన్లో... లేకపోతే ఇంట్లో.. అంతేతప్ప లేడీ సూపర్‌స్టార్ నయనతారకు వేరే వెకేషన్సేమీ ఉండవట. తన ఖాళీ సమయాన్నంతా పిల్లలతో ఆడుకోవడం, భర్తకు ఇష్టమైన వంటలు చేసి పెట్టడంతోనే సరిపోతుందట. పైగా వంట చేయడంలో నయన్ సిద్ధహస్తురాలట. ఈ విషయం గురించి ఇటీవల ఓ తమిళ ఇంటర్వ్యూలో నయనతార మాట్లాడుతూ 'చిన్నప్పుడు అమ్మ దగ్గర నేర్చుకున్న ఫలితం ఇదంతా. నేను ఏం ఐటమ్ చేసినా రుచిగా ఉంటుందని చాలామంది అంటుంటారు. నా భర్త విగ్నేష్‌కి టమాటా పప్పు చాలా ఇష్టం. నేను ఇంట్లో ఉంటే, ఆ రోజు వంటకాల్లో టమాటా పప్పు కచ్చితంగా చేస్తా. ఒక్కోసారి షూటింగ్స్ లేక గ్యాప్ ఎక్కువ వస్తుంది. దాంతో.. విఘ్నేష్‌కి రోజూ టమాటా పప్పే. 'ప్లీజ్ వద్దు.. వేరేదేదైనా చేయ్..' అని బతిమాలుతాడు. తనకోసం వేరే ఐటమ్ చేసినా, వాటితోపాటు టమాటా పప్పు కామన్' అంటూ అందంగా నవ్వేసింది నయనతార.




## రై రై రారా.. అడ్డే లేని దారై రారా..

అగ్ర హీరో రామ్‌చరణ్ నటిస్తున్న పానిండియా మాస్ ఎంటర్‌టైనర్ 'పెద్ది' ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మేకర్స్ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇప్పటికే ఈ సినిమా ప్రచార చిత్రాలు ప్రపంచవ్యాప్తంగా వైరల్‌గా మారాయి. ముఖ్యంగా 'చికిరి' సాంగ్ అయితే.. విదేశీయులు సైతం రీల్స్ చేసేంత క్రేజ్‌ని సొంతం చేసుకుంది. ఈ క్రమంలోనే సోమవారం ఈ సినిమా నుంచి రెండో పాటను మేకర్స్ విడుదల చేశారు. 'రై రై రారా.. రై రై రారా.. అడ్డే లేని దారై రారా.. రై రై రారా.. రై రై రారా.. హద్దే లేని తీరై రారా..' అంటూ సాగే ఈ పాటను అనంతశ్రీరామ్ రాయగా, ఏ.ఆర్.రెహ్మాన్ స్వరపరిచి, స్వయంగా ఆలపించారు. క్యాచీగా, జనబాహుళ్యంలోకి త్వరగా వెళ్లేలా, శ్రోతల్ని అలరించేలా ఈ మాస్ నంబర్ సాగింది. కథానాయకుని పరిచయగీతం ఎలా ఉండాలో ఓ కొత్త బెంచ్‌మార్క్‌ని సెట్ చేస్తూ, ఈ గీతాన్ని రూపొందించారు దర్శకుడు బుచ్చిబాబు సానా. రామ్‌చరణ్ తన మాస్ ఎనర్జీతో కూడిన గ్రేస్‌తో ఈ పాటలో స్టెప్పులు అదరగొట్టారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ ఈ పాటకు హైలైట్. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఆర్.రత్నవేలు, నిర్మాత: వెంకటసతీష్ కిలారు, సమర్పణ: మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్, నిర్మాణం: వృద్ధి సినిమాస్.

## యాక్షన్ థ్రిల్లర్‌గా పోలీస్ కైంప్లెంట్



వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్‌చంద్ర ప్రధానపాత్రధారులుగా రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'పోలీస్ కైంప్లెంట్'. సంజీవ్ మేగోటి దర్శకుడు. బాలకృష్ణ మహారాణా నిర్మాత. ఇటీవలే సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా నుంచి 'ప్రేమ ఓ ప్రేమ' అంటూ సాగే ఓ పాటను విడుదల చేశారు. సీనియర్ జర్నలిస్ట్ ప్రభు ఈ పాటను లాంచ్ చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. యాక్షన్, కామెడీ, రొమాన్స్ మేలుకలయికగా రూపొందిన ఈ చిత్రం అన్ని వర్గాలకూ నచ్చుతుందని దర్శకుడు నమ్మకం వెలిబుచ్చారు. రాగిణి ద్వివేది, కృష్ణసాయి, ఆదిత్య ఓం, సప్తగిరి తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈచిత్రానికి కెమెరా: ఎస్.ఎన్.హరీష్, సంగీతం: ఆరోహణ సుధీంద్ర, సంజీవ్ మేగోటి, సుధాకర్ మారియా, నిర్మాణం: ఎంఎస్‌కే ప్రమిదశ్రీ ఫిల్మ్స్.

## 109 సెంటర్స్.. 50 డేస్.. ఎన్నాళ్లకెన్నాళ్లకు 50 రోజుల పోస్టర్

ఒకప్పుడు ఏ సినిమా పోస్టర్ చూసినా '100 డేస్', '50 డేస్' అనే కలర్‌ఫుల్ అక్షరాలు కనిపించేవి. ఆ రోజుల్లో థియేటర్లలో ఇన్ని రోజులు సినిమా ఆడటం అనేది ఇండస్ట్రీకి, ఫ్యాన్స్‌కి ఒక ప్రెస్టీజ్ ఇష్యూ. కానీ ఎప్పుడైతే OTT యుగం మొదలైందో.. ఆ బాక్సాఫీస్ లెక్కలన్నీ పూర్తిగా మారిపోయాయి. ఇప్పుడు సినిమా హిట్ లేదా ఫ్లాప్ అనేది ఫస్ట్ వీకెండ్ కలెక్షన్స్ బట్టే డిసైడ్ అయిపోతోంది. ఒక వారం, మహా అయితే రెండు వారాలు ఆడితే అదే పెద్ద సక్సెస్ అనుకునే పరిస్థితికి వచ్చేశాం. ఒక సినిమా థియేటర్లలో 20 రోజులు నిలబడటమే ఒక గగనంగా మారిపోయిన ఈ ఫాస్ట్ ఫార్వర్డ్ జనరేషన్‌లో, లాంగ్ రన్ అనే కాన్సెప్ట్ కనుమరుగైపోయింది. సరిగ్గా ఇలాంటి టైమ్‌లో ఎన్నో ఏళ్లుగా మనం మర్చిపోయిన 'సెంటర్స్', 'డేస్' అనే మాటలను మళ్లీ బలంగా వినిపించింది మన శంకరవరప్రసాద్ గారు సినిమా. సంక్రాంతికి విడుదలైన చిరంజీవి సినిమా ఏకంగా 109 కేంద్రాల్లో 50 రోజులు పూర్తి చేసుకోవడం ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పుడంతా ఫస్ట్ వీక్ గ్రాస్, పాన్ ఇండియా షేర్ గురించే మాట్లాడుకుంటున్న ఈ రోజుల్లో.. ఒక సినిమా ఇన్ని సెంటర్లలో హాఫ్ సెంచరీ కొట్టడం మామూలు విషయం కాదు. ఈ రికార్డ్ చూశాక అభిమానుల్లో, డిస్ట్రిబ్యూటర్లలో పాత రోజుల నాటి ఒక కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. థియేటర్ ఎక్స్‌పీరియన్స్ ఇంకా బతికే ఉందని, కంటెంట్ ఉంటే జనాలు థియేటర్లకు వస్తారని ఈ విజయం గట్టిగా ప్రూవ్ చేసింది. అయితే ఈ థియేట్రికల్ లాంగ్ రన్ మళ్లీ రిపీట్ కావడానికి కేవలం సినిమా కంటెంట్ మాత్రమే కాదు, తెరవెనుక జరుగుతున్న మరో ఆసక్తికరమైన చర్చ కూడా ప్రధాన కారణం అవుతోంది. అదే




8 వారాల ఓటీటీ గ్యాప్. గతంలో సినిమాలు రిలీజైన మూడు నాలుగు వారాలకే ఇంకా చెప్పాలంటే.. కొన్నిసార్లు అంతకంటే ముందే ఓటీటీల్లోకి వచ్చేయడంతో, జనాలు థియేటర్లకు వెళ్లడం బాగా తగ్గించారు.
ఎలాగూ నెల రోజుల్లో మన ఫోన్లోనో లేదంటే టీవీలో వస్తుంది కదా.. ఫ్యామిలీతో కలిసి ఇంట్లోనే చూద్దాం అనే మైండ్‌సెట్ ఆడియన్స్‌లో ఫిక్స్ అయిపోయింది. ఈ డ్యామేజ్‌ని కంట్రోల్ చేయడానికి థియేట్రికల్ రిలీజ్‌కి, ఓటీటీ రిలీజ్‌కి మధ్య కనీసం 8 వారాల గ్యాప్ కచ్చితంగా ఉండాలనే రూల్‌ను మన ఇండస్ట్రీ వాళ్లు సీరియస్‌గా అమలు చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ 8 వారాల రూల్ కనక పక్కాగా అమలైతే.. బాక్సాఫీస్ దగ్గర మళ్లీ పాత రోజులు చూసే ఛాన్స్ ఖచ్చితంగా ఉంది. ఓటీటీలో సినిమా రావడానికి చాలా టైమ్ పడుతుంది అని తెలిస్తే, పాజిటివ్ టాక్ వచ్చిన ఏ సినిమానైనా సరే జనాలు థియేటర్లలోనే చూడటానికి ఇష్టపడతారు. ఇప్పటికే హిందీ, మలయాళంలో ఇదే జరుగుతుంది. అందుకే ధురంధర్ లాంటి సినిమాలు 50 రోజుల వరకు కలెక్షన్లు తెచ్చాయి. అలాగే కేరళలో లోక అనే సినిమా 100 రోజులు ఆడింది. ఇదే తెలుగులో రిపీట్ చేయాలని చూస్తున్నారు మేకర్స్. దీనివల్ల ఆటోమెటిక్‌గా థియేటర్లలో ఫుట్‌ఫాల్స్ పెరుగుతాయి. వీకెండ్స్ దాటాక కూడా జనాలు వస్తుంటే థియేటర్ల ఓనర్లు సినిమాలను తీసేయరు. అలా నాచురల్‌గా సినిమాల లాంగ్ రన్ పెరిగి.. మళ్లీ 50 రోజుల పోస్టర్లు మన కళ్ల ముందుకు వచ్చే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఫైనల్‌గా చెప్పాలంటే.. మన శంకరవరప్రసాద్ గారు సినిమా సాధించిన ఈ 50 రోజుల రికార్డ్ కేవలం ఒక మిరాకిల్ కాదు.. భవిష్యత్తు బాక్సాఫీస్ ట్రెండ్‌కి ఒక పాజిటివ్ ఇండికేషన్. కంటెంట్ బాగుండి, ఓటీటీ రిలీజ్ గ్యాప్ 8 వారాలు స్ట్రిక్ట్‌గా మెయింటైన్ చేస్తే.. వారం, రెండు వారాలకే థియేటర్ల నుంచి సినిమాలు కనుమరుగయ్యే ట్రెండ్‌కి చెక్ పెట్టొచ్చు. సిల్వర్ స్క్రీన్ మ్యాజిక్‌ని ఎంజాయ్ చేయడానికి ఆడియన్స్ ఎప్పుడూ రెడీగానే ఉంటారు. సరైన రూల్స్, మంచి కంటెంట్ ఉంటే.. టాలీవుడ్‌లో మళ్లీ పాత రోజుల నాటి థియేట్రికల్ సెలబ్రేషన్స్ చూడటం గ్యారెంటీ.



## అందాల నేహా శెట్టికి ఆఫర్స్ కరువయ్యాయే..

అందాల భామ నేహా శెట్టి క్రేజ్ పెంచేసింది ఒకే ఒక్క సినిమా అది డీజే టిల్లు. మెహబూబా సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. డైరెక్టర్ పూరి జగన్నాథ్ తనయుడు ఆకాష్ పూరి నటించిన మెహబూబా సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఈ సినిమా అంతగా ఆకట్టుకోలేకపోయింది. కానీ నేహాకు తెలుగులో అవకాశాలు వచ్చాయి. ఆ తర్వాత సిద్ధు జొన్నలగడ్డ సరసన డీజే టిల్లు సినిమాతో ఒక్కసారిగా పాపులర్ అయ్యింది. ఇందులో ఆమె నటించిన రాధిక పాత్ర యూత్ లో ఎంతగా వైరల్ అయ్యిందో చెప్పక్కర్లేదు. ఆ తర్వాత తెలుగులో బ్యాక్ టూ బ్యాక్ సినిమాల్లో నటించినప్పటికీ అంతగా ఫేమ్ మాత్రం రాలేదు. దీంతో మెల్లగా ఇండస్ట్రీలో ఆఫర్స్ తగ్గిపోయాయి. చాలా కాలంగా నేహా శెట్టి ఒక్క సినిమా కూడా చేయలేదు. కానీ ఇటీవలే పవన్ కళ్యాణ్ నటించిన ఓజీ చిత్రంలో ఓ స్పెషల్ సాంగ్ చేసింది. కానీ ఈ అమ్మడు బ్యాడ్ లక్ అక్కడ సైతం వెంటపడింది. ఓజీ చిత్రం నిడివి ఎక్కువ కావడంతో నేహా శెట్టి స్పెషల్ తొలగించింది చిత్రయూనిట్. ఆ తర్వాత కొద్ది రోజులకు ఆమె పాటను యూట్యూబ్ లో షేర్ చేసినప్పటికీ నేహాకు ముందు వచ్చినంత క్రేజ్ మాత్రం రాలేదు. ప్రస్తుతం తెలుగులో సరైన అవకాశాల కోసం ఎదురుచూస్తుంది. అలాగే సోషల్ మీడియాలో గ్లామర్ ఫోటోస్ షేర్ చేస్తుంది. నెట్టింట క్రేజీ ఫోటోలు షేర్ చేస్తుంది ఈ అందాల ముద్దుగుమ్మ. ఈ అమ్మడు హాట్ హాట్ ఫోటోలు చేస్తూ ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ బ్యూటీ పంచుకున్న ఫోటోలకు నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**